




ఉత్సవాలను సూచిస్తూ ధ్వజారోహణం



దేవతలారా రండి

- శ్రీగిరిపై బ్రహ్మోత్సవాలు ప్రారంభం
- వైభవంగా ధ్వజారోహణ
- శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం తరపున పట్టువస్త్రాల సమర్పణ
- నేడు స్వామి, అమ్మవార్లకు భృంగి వాహన సేవ



శ్రీశైలం, మార్చి 1: శ్రీశైలం క్షేత్రంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు శుక్రవారం ఉదయం యాగశాల ప్రవేశంతో వైభవంగా ప్రారంభమయ్యాయి. నవాహ్నిక దీక్షతో 11 రోజులపాటు జరిగే ఈ బ్రహ్మోత్సవాలు ఈ నెల 11న ముగియనున్నాయి. శుక్రవారం ఉదయం ఆలయ ప్రాంగణంలోని స్వామివారి యాగశాల ప్రవేశం కార్యక్రమంతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆగమ శాస్త్రానుసారం బ్రహ్మోత్సవ ప్రారంభ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో వేదపండితులు చతుర్వేదపారాయణాలు చేసి వేద స్వస్తి నిర్వహించారు. వేద స్వస్తి తరువాత దేశం శాంతి సౌభాగ్యాలతో విలసిల్లాలని ఆలయ అర్చకులు, వేదపండితులు లోక కళ్యాణ సంకల్పాన్ని పఠించారు. దీనినే శివ సంకల్పం అంటారు. అనంతరం ఉత్సవాలు నిర్విఘ్నంగా జరగాలని మహా గణపతి పూజను చేశారు. ఈ బ్రహ్మోత్సవాల సృష్టికర్త అయిన బ్రహ్మదేవుని ఆధ్వర్యంలో, క్షేత్రపాలకుడైన వీరభద్రస్వామి పర్యవేక్షణలో, శివ పరివార దేవతలలో ఒకరైన చండీశ్వరుని నాయకత్వంలో జరుగుతున్నందున చండీశ్వరునికి ప్రతేకంగా పూజాదికాలు జరిపారు. కంకణాలకు శాస్త్రోక్తంగా పూజాదికాలు నిర్వహించి వాటిని అర్చకులు, అధికారులు ధరించారు. అనంతరం రుత్విగ్వరణం నిర్వహించి, అఖండ దీపస్థాపన, వాస్తు పూజ, వాస్తు హోమం జరిపించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షులు రెడ్డివారి చక్రపాణిరెడ్డి దంపతులు, కార్యనిర్వాహధికారి డి.పెద్దిరాజు, ధర్మకర్తల మండలి సభ్యులు విరూపాక్షయ్య స్వామి, విజయలక్ష్మి, మాధవీలత తదితరులు పాల్గొన్నారు.

స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాల సమర్పణ

మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లకు శుక్రవారం మధ్యాహ్నం శ్రీకాళహస్తి దేవస్థానం పట్టువస్త్రాలను సమర్పించింది. కార్యక్రమంలో శ్రీకాళహస్తి దేవస్థానం తరపున ఆ దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎస్‌వీ నాగేశ్వరరావు పట్టువస్త్రాలను సమర్పించారు. కార్యక్రమంలో ముందుగా ఆలయ రాజగోపురం వద్ద సంప్రదాయాన్ని అనుసరించి ఆలయ ఈవో డి. పెద్దిరాజు, అధికారులు, అర్చకులు, వేదపండితులు శ్రీకాళహస్తి దేవస్థానం అధికారులకు స్వాగతం పలికారు. తరువాత ఆలయ రాజగోపురం వద్ద పట్టువస్త్రాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం మేళతాళాలతో ఆలయ ప్రవేశం చేసి స్వామి అమ్మవార్లకు పట్టువస్త్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా శ్రీకాళహస్తి దేవస్థానం కార్యనిర్వహణాధికారి నాగేశ్వరరావు మాట్లాడుతూ శ్రీకాళహస్తి దేవస్థానం తరపున స్వామిఅమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామి, అమ్మవార్లకు శ్రీకాళహస్తి దేవస్థానం తరపున పట్టువస్త్రాలను సమర్పించడం ఆనవాయితీ అన్నారు.



శ్రీకాళహస్తి దేవస్థానం తరపున పట్టువస్త్రాలు



నేడు భృంగి వాహన సేవ

బ్రహ్మోత్సవాల రెండో రోజు నుంచి స్వామి, అమ్మవార్లకు వాహన సేవలు మొదలవుతాయి. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు శనివారం భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లకు భృంగి వాహన సేవ నిర్వహిస్తారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా దేవస్థానం పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసింది. ఈ సాంస్కృతిక కార్యక్రమాలను ఆలయ దక్షిణ మాఢ వీధిలోని నిత్యాకళారాధన వేదిక, పుష్కరిణి ప్రాంగణంలోని భ్రామరీ కళావేదిక, శివదీక్షాశిబిరాల ప్రాంగణంలో నిర్వహిస్తోంది. శుక్రవారం సాయంత్రం సంప్రదాయ నృత్యం, భక్తి రంజని, శివలీలలు, వీణానాదం, పార్వతీ కల్యాణం, రామాంజనేయ యుద్ధం కార్యక్రమాలను నిర్వహించారు.

శాస్త్రోక్తంగా ధ్వజారోహణం

బ్రహ్మోత్సవాల మొదటి రోజు ధ్వజారోహణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. అంతకముందు అంకురార్పణ కార్యక్రమం నిర్వహించి అనంతరం ఆలయ ప్రాంగణంలోని ప్రధాన ధ్వజస్తంభం మీద పతావిష్కరణ చేసి ధ్వజారోహణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొత్త వస్త్రం మీద పరమశివుని వాహనమైన నందీశుని చిత్రీకరిస్తారు. దీనికే ధ్వజపటం అని పేరు. తరువాత ధ్వజపటానికి చండీశ్వరుని సమక్షంలో ప్రత్యేక పూజాదికాలు, భేరీ పూజ నిర్వహిస్తారు. ఈ భేరీ పూజలో డోలు వాయిద్యానికి పూజాదికాలు చేసి తరువాత నాదస్వరంపై ఆయా రాగాల ఆలాపనతో ఆయా దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తారు. చివరగా ధ్వజస్తంభంపై ఎగరవేస్తారు. ధ్వజస్తంభం మీద ఎగిరే ఈ నంది పతాకమే సకల దేవతలు, యక్ష, గంధర్వ గణాలకు ఆహ్వానమని, బ్రహ్మోత్సవాల సమయంలో దేవతలంతా క్షేత్రంలోనే ఉంటూ ఉత్సవాన్ని తిలకిస్తారని ఆగమ శాస్త్రాలు చెబుతున్నాయి.



యాగశాలలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఈఓ పెద్దిరాజు

ఇంటర్ పరీక్షలు ప్రారంభం

- మొదటి సంవత్సరం లాంగ్వేజ్ పరీక్షకు 501 మంది గైర్హాజరు
- పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్, ఎస్పీ
- ఆర్టీసీ బస్సులు లేక విద్యార్థుల అవస్థలు



నంద్యాలలో పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్, ఎస్పీ

నంద్యాల (నూనెపల్లె), మార్చి 1 : ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు 2024 శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. మొదటి సంవత్సరం విద్యార్థులకు లాంగ్వేజ్ పరీక్ష జరిగింది. విద్యార్థులు పరీక్షలు రాసేందుకు జిల్లా వ్యాప్తంగా 52 పరీక్షా కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. మొదటి పరీక్ష కావడంతో విద్యార్థులు వారి తల్లిదండ్రులతో కలిసి గంట ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. ఉదయం 8.30 గంటలకు పరీక్షా కేంద్రంలోకి విద్యార్థులను తనిఖీ చేసి అనుమతించారు. 9.00 గంటల నుంచి 12.00 గంటల వరకు పరీక్ష ప్రశాంతంగా జరిగింది. జిల్లాలో మొత్తం 19 ప్రభుత్వ కళాశాలలు, ఒక సోషల్ వెల్ఫేర్, ఒక ట్రైబల్ వెల్ఫేర్, రెండు మోడల్ స్కూళ్లు, 29 ప్రైవేటు జూనియర్ కళాశాలలో పరీక్షా కేంద్రాలుగా అధికారులు ఏర్పాటు చేశారు. 52 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 52 మంది డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, 3 స్క్వాడ్ టీమ్‌లు పరీక్షల విధులు నిర్వర్తించారు. మొదటి రోజు జిల్లా వ్యాప్తంగా 12,909 మంది విద్యార్థులకుగాను 12,408 మంది విద్యార్థులు హాజరయ్యారు. 501 మంది గైర్హాజరయ్యారని, జిల్లాలో ఎక్కడా మాల్ ప్రాక్టీస్ జరగలేదని, ప్రశాంతంగా పరీక్షలు జరిగాయని డీవీఈఓ సునీత తెలిపారు.

సీసీ కెమెరా ఫుటేజీల ద్వారా పరిశీలన

జిల్లా కేంద్రంలోని పలు ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాలను కలెక్టర్ కె. శ్రీనివాసులు, ఎస్పీ రఘువీర్‌రెడ్డి తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రాలలోని వసతులను పరిశీలించారు. సీసీ కెమెరాల వెబ్ క్యాస్టింగ్ ద్వారా పరీక్షల నిర్వహణకు ఏర్పాటు చేయడంతో సీసీ కెమెరా ఫుటేజీలలో పరీక్ష నిర్వహణను పరిశీలించారు. పరీక్షా అధికారులకు, సిబ్బందికి వారు పలు సూచనలు చేశారు.

పకడ్బందీగా పరీక్షల నిర్వహణ

ఇంటర్ పరీక్షలను ఈ దఫా మరింత పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. కేంద్రాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ అమలులో పెట్టారు. పరీక్షకు వచ్చిన విద్యార్థులను క్షుణ్ణంగా పరిశీలించి పరీక్షా కేంద్రంలోనికి అనుమతించారు. ప్రతి విద్యార్థి హాజరును ఆన్‌లైన్‌లో తీసుకున్నారు. పరీక్షా పత్రాలకు క్యూఆర్ కోడ్‌ను జోడించారు. దీని వల్ల పేపర్ ఎక్కడ ఫొటో తీసినా, స్కాన్ చేసినా తెలిసిపోతుంది. పరీక్షా కేంద్రాల ఆవరణలోకి సెల్ ఫోన్లను అనుమతించలేదు. పేపర్లను భద్రపరిచే స్టేషన్‌లో కూడా ఇంటర్ బోర్డు అందించే ప్రత్యేకమైన ఫోన్లను మాత్రమే వినియోగించాలి. ఇది కేవలం ఇంటర్మీడియట్ బోర్డు నుంచి పరీక్షల విభాగం అధికారులకు వచ్చిన సందేశాలను చూసేందుకు మాత్రమే ఉపయోగపడుతుంది. పైగా ఈ ఫోన్ పరీక్షకు 15 నిమిషాల ముందు మాత్రమే పని చేస్తుంది. ప్రతి 20 మంది విద్యార్థులకు ఒక ఇన్విజిలేటర్‌ను నియమించారు.



ఇబ్బందికరంగా నిమిషం ఆలస్యం నిబంధన

మండల, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు పరీక్షా కేంద్రాలకు చేరుకునేందుకు ఆర్టీసీ బస్సుల సౌకర్యాన్ని కల్పించకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఒక్క నిమిషం ఆలస్యమైతే పరీక్షా కేంద్రంలోనికి అనుమతి లేకపోవడం అనే నిబంధన ఇంటర్మీడియట్ బోర్డు పెట్టడంతో గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఇబ్బందికరంగా మారింది. ఇంటర్ పరీక్షలు ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు జరుగుతున్నాయి. ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోనికి అనుమతించబోమని ఇంటర్ బోర్డు హెచ్చరికలు జారీ చేసిన విషయం తెలిసిందే. దీనికి తగ్గట్లుగా ఆర్టీసీ నుంచి ప్రత్యేక బస్సులు ఇంటర్ విద్యార్థుల కోసం ఏర్పాటు చేయలేదు. అసలు ఇంటర్ బోర్డు నుంచి బస్సులు కావాలనే ప్రతిపాదనే రాలేదని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. జిల్లాలో ఉదయం 10.00 వరకు మండలాల్లోని గ్రామీణ ప్రాంతాలకు బస్సుల సౌకర్యం సక్రమంగా లేదు. విద్యార్థులు పట్టణ కేంద్రాల్లోని పరీక్షా కేంద్రాలకు చేరుకునేందుకు ఆటోలలో, ద్విచక్ర వాహనాలలో హడావుడిగా, ఆందోళనకరంగా రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. అలాంటి చోట ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేస్తే విద్యార్థులు ఇబ్బందులు పడాల్సిన అవసరం ఉండక పోవచ్చునని విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజలు కోరుతున్నారు.

6న నంద్యాలకు చంద్రబాబు

- ప్రజా గళం పేరుతో సభ
- సభా స్థలాన్ని పరిశీలించిన టీడీపీ నాయకులు



నంద్యాల (నూనెపల్లె), మార్చి 1 : టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈనెల 6వ తేదీన నంద్యాలకు వస్తున్నట్లు టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, పొలిట్ బ్యూరో సభ్యుడు, నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎన్‌ఎండీ ఫరూక్ తెలిపారు. శుక్రవారం పట్టణ శివారులో సభా వేదికను ఏర్పాటు చేసేందుకు స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా గళం పేరుతో నంద్యాల, ఆళ్ళగడ్డ, పాణ్యం నియోజకవర్గాలకు సంబంధించి టీడీపీ నాయకులు, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జిలు, బూత్ కన్వీనర్లు, మండల, గ్రామ స్థాయి నాయకులతో సమావేశం ఉంటుందని అన్నారు. ఒక్కో నియోజకవర్గం నుంచి దాదాపు 2500 మంది టీడీపీ నాయకులు పాల్గొంటారని వారు పేర్కొన్నారు.



నంద్యాలలో స్థలాన్ని పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

అంతా దోపిడే..

- డోన్‌లో మైనింగ్, లిక్కర్, ఇసుక మాఫియాలు
- మంత్రి బుగ్గన అక్రమ కేసులతో బెదిరిస్తున్నారు..
- ప్రజల భవిష్యత్తు కోసమే డోన్ నుంచి పోటీ
- కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డి



కేఈ బ్రదర్స్‌తో పాటు, కోట్ల జయసూర్యప్రకాష్‌కు గజమాలతో సత్కారం

డోన్, మార్చి 1: డోన్ నియోజకవర్గంలో మైనింగ్, లిక్కర్, ల్యాండ్, ఇసుక మాఫియాలతో అంతా దోపిడీ చేస్తున్నారని కేంద్ర మాజీ మంత్రి, డోన్ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం పట్టణంలోని మధు ఫంక్షన్ హాలులో నియోజకవర్గ టీడీపీ విస్తృత స్థాయి ఆత్మీయ సభలో కోట్ల మాట్లాడారు. తాను కర్నూలు ఎంపీగా మూడు సార్లు, రైల్వే శాఖ సహాయ మంత్రిగా ఒకసారి పని చేశానన్నారు. డోన్ నియోజకవర్గంలో మంత్రి బుగ్గన ఆరాచకాలతో ఇబ్బందులు పడుతున్న పార్టీ కార్యకర్తలు, ప్రజలకు అండగా ఉండాలనే ఇక్కడకు వచ్చానని తెలిపారు. మైనింగ్ వనరులు ఎక్కువగా ఉన్నాయని.. పరిశ్రమలు తీసుకొచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నదే తమ లక్ష్యమన్నారు. మంత్రి బుగ్గన చేసిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. అంతా దోపిడీ పాలన సాగిస్తూ మాఫియాలను పెంచి పోషించారని ధ్వజమెత్తారు. బావిపేట సర్పంచ్ లింగన్నను టార్గెట్ చేసి వైసీపీలోకి రావాలని, అక్రమ కేసులు బయటకు తీస్తున్నారని, అలాంటి వాటికి ఎవరూ భయపడవద్దని భరోసా ఇచ్చారు. అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి చెందాలంటే టీడీపీని గెలిపించుకుని చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ మంత్రి కేఈ ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యేలు కోట్ల సుజాతమ్మ, గౌరు చరితారెడ్డి, మీనాక్షి నాయుడు, పత్తికొండ టీడీపీ అభ్యర్థి కేఈ శ్యాంబాబు, మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి తిక్కారెడ్డి, కేవీ సుబ్బారెడ్డి, కోట్ల రాఘవేంద్రరెడ్డి, కోట్ల నివేదిక, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు వై.నాగేశ్వరరావు, వలసల రామకృష్ణ, కోట్రికే ఫణిరాజ్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ లక్కసాగరం లక్ష్మీరెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడు, ఓబులాపురం శేషిరెడ్డి, లక్ష్మీనారాయణ యాదవ్, చంద్రపలి ఆచారి పాల్గొన్నారు.

కదంతొక్కిన తెలుగు తమ్ముళ్లు: నూతన ఉత్సాహంతో కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డికి ఘన స్వాగతం పలికారు. డోన్ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థిగా కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి పేరును ప్రకటించిన తర్వాత మొదటిసారి శుక్రవారం పట్టణంలో టీడీపీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. నియోజకవర్గం నుంచి వేలాది మంది తరలి వచ్చారు. కార్యకర్తల సందడితో ప్రధాన రహదారులన్నీ పసుపుమయమయ్యాయి. గుత్తి రోడ్డులోని అమ్మ హోటల్ నుంచి టాపులేని వాహనంపై కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, కేఈ ప్రభాకర్, కేఈ శ్యాంబాబు, కోట్ల రాఘవేంద్ర రెడ్డి ర్యాలీగా బయలుదేరారు. వందలాది ద్విచక్ర వాహనాలతో నిర్వహించిన ర్యాలీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. బాణాసంచా పేలుస్తూ పసుపు దళం కదం తొక్కింది. ఎండలను సైతం లెక్కచేయకుండా వేలాది మంది కార్యకర్తలు ర్యాలీలో పాల్గొని అభిమానాన్ని చాటారు. కొండపేట, పాతబస్టాండు మీదుగా మధు ఫంక్షన్ హాలు వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి ఎంట్రీ అదిరిపోవడంతో పార్టీ కార్యకర్తల్లో కొత్త జోష్ నింపింది.



భారీగా తరలివచ్చిన టీడీపీ, జనసేన శ్రేణులు

ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభం

నందికొట్కూరు, మార్చి 1: ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రారంభమయ్యాయి. నందికొట్కూరులో మూడు పరీక్షా కేంద్రాల్లో 1062 మంది విద్యార్థులకు గాను 1019 మంది హాజరు కాగా 43 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. దీంతో 95.95 శాతంగా హాజరు నమోదైంది. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 406కు గాను 391 మంది విద్యార్థులు, శ్రీ నంది జూనియర్ కళాశాలలో 279 మందికి గాను 258 మంది విద్యార్థులు, విజ్ఞాన్ జూనియర్ కళాశాలలో 377 మందికి గాను 370 మంది విద్యార్థులు హాజరయ్యారు.

పాములపాడు: పాములపాడులోని ప్రభుత్వ జూనియర్ కళశాలలో శుక్రవారం ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. శుక్రవారం పాములపాడు లోని, కెజివిబి, ఆదర్శ పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. ఇందులో 114మంది విద్యార్థులకు గాను 112 మంది హాజరయ్యారని ఎగ్జామ్ చీఫ్ తెలిపారు.

'పోలియో రహిత సమాజాన్ని నిర్మించుకుందాం'

మహానంది, మార్చి 1: రెండు చుక్కలతో పోలియో రహిత సమాజాన్ని నిర్మించుకుందామని తిమ్మాపురం పీహెచ్‌సీ ఎంపీహెచ్ఈవో ఉసేన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం జరిగే పల్స్ పోలియో క్యాక్రమాన్ని విజయవంతం చేయాలని శుక్రవారం మహానంది సమీపంలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఉసేన్‌రెడ్డి మాట్లాడుతూ ఐదు సంవత్సరాలలోపు చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని అంబమ్మ, వైద్య సిబ్బంది హేమలత, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

'సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలి'



జెండావిష్కరణలో అసోసియేట్ డీన్ కేఎస్ఎస్ నాయక్

గోస్పాడు, మార్చి 1: సమాజాభివృద్ధిలో యువకులు, విద్యార్థులు భాగస్వాములు కావాలని మహానంది వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ కేఎస్ఎస్ నాయక్ సూచించారు. మండలంలోని కానాల పల్లె గ్రామంలో శుక్రవారం డీన్ ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ జెండాను ఆవిష్కరించారు. ఎన్ఎస్ఎస్ ఇన్‌చార్జి డాక్టర్ సరోజిని దేవి అధ్యక్షతన మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాల ఆవరణలో కార్యక్రమాన్ని నిర్వహించారు. అసోసియేట్ డీన్ మాట్లాడుతూ విద్యార్థుల ప్రథమ కర్తవ్యం విద్యాభ్యాసమని, భావి భారతాన్ని నిర్ణయించాల్సింది యువతే అన్న విషయాన్ని గుర్తుంచుకొని సమాజాభివృద్ధిలో భాగస్వామ్యం కావాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. ప్రతి విద్యార్థి సేవా దృక్పథంతో మెలగాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి స్వప్నిక, ప్రధానోపాధ్యాయుడు శార్దక్ బాబు, ఓఎస్ఏ డాక్టర్ అబ్దుల్ సలాం, డాక్టర్ ఎం.విజయభాస్కర్‌రెడ్డి, గ్రామ రైతులు, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీగిరికి పాదయాత్రగా శివస్వాములు

● మొదలైన అన్నదాన కార్యక్రమాలు



పాదయాత్రగా శ్రీశైలానికి వెళ్తున్న భక్తులు

ఆత్మకూరురూరల్, మార్చి 1: ద్వాదశ జ్యోతిర్లింగాలలో ప్రముఖ శైవ క్షేత్రంగా వెలసిన శ్రీశైల పుణ్యక్షేత్రానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పాదయాత్రగా తరలి వస్తున్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి శివస్వాములు, భక్తులు పాదయాత్రగా వెంకటాపురం చేరుకుని అక్కడి నుంచి నల్లమల అరణ్య ప్రాంతం గుండా శ్రీశైలం చేరుకుంటున్నారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీగిరికి పాదయాత్రగా తరలివెళ్లే భక్తుల కోసం నేటి నుంచి జిల్లా ఆరోగ్యవైద్యశాఖ ఆదేశాల మేరకు ప్రత్యేక వైద్యశిబిరాలను నిర్వహిస్తున్నారు. ప్రధానంగా ఎస్ఆర్‌బీసీ, ఆత్మకూరు పట్టణంలోని మలేరియా నిర్ధారణ కేంద్రం, నంద్యాల టర్నింగ్, శ్రీపతిరావుపేట, వెంకటాపురం, నాగలూటి, పెచ్చెర్వు గూడేల్లో ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. శ్రీశైలం పాదయాత్రగా వెళ్ళే భక్తులు ఈ వైద్య శిబిరాలను సద్వినియోగించుకోవలసిందిగా వైద్యాధికారులు గోపాల్, పవన్‌కుమార్ సూచించారు. అలాగే పాదయాత్రికులకు తీవ్ర అనారోగ్య సమస్యలు తలెత్తితే సత్వర వైద్య సేవలు అందించేందుకు 108 వాహనాన్ని అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

పాదయాత్రికుల కోసం అన్నదాన కార్యక్రమాలు

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీశైలానికి పాదయాత్రగా తరలి వెళ్లే పాద యాత్రికుల కోసం నేటి నుంచి శివరాత్రి పర్వదినం వరకు మల్లేశ్వర స్వామి దేవస్థానం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. వెంకటాపురం గ్రామంలో, ఎస్ఆర్‌బీసీ కాలనిలో మల్లేశ్వరస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో, నల్లమల అభయారణ్యంలోని నాగలూటి క్షేత్రంలో పెద్ద దేవళాపురం గ్రామానికి చెందిన విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో దాతల సహకారంతో అన్నదాన శిబిరాలను ఏర్పాటు చేశారు. పాదయాత్రగా ఆత్మకూరు మీదుగా శ్రీశైలం పాదయాత్రగా తరలి వెళ్ళే భక్తుల కోసం 7వ తేది వరకు ఈ అన్నదాన శిబిరాలను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

పకడ్బందీగా ఎన్నికలు నిర్వహించాలి: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీనివాసులు

నంద్యాల (కల్చరల్), మార్చి 1: సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్ డా. కె. శ్రీనివాసులు 16 కమిటీల నోడల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన చాంబర్‌లో జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డితో కలిసి ఎన్నికల నిర్వహణపై నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ విధుల నిర్వహణకు సిబ్బందిని సమకూర్చుకోవడంతోపాటు గైర్హాజరు కాకుండా రిజర్వు సిబ్బందిని కూడా సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. పోలింగ్ సిబ్బంది, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్స్, స్టాటిస్టిక్, వీడియో సర్వైలెన్స్ టీమ్స్, వీడియో వ్యూవింగ్ తదితర అన్ని రకాల బృంద అధికారులకు శిక్షణ ఇవ్వాలన్నారు. భారత ఎన్నికల సంఘం సూచించిన అన్ని అంశాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలింగ్ మెటీరియల్ సరఫరా లోట ుపాట్లు లేకుండా నివేదికలు తయారు చేసుకొని సిద్ధంగా ఉంచుకోవాలని మెటీరియల్ మేనేజ్మెంట్ నోడల్ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి, ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఖర్చు వివరాల పర్యవేక్షణపై ఏర్పాటు చేసుకున్న ఎంసీసీ బృందాలకు ప్రాపర్ శిక్షణ నివ్వాలన్నారు.

● ముఖ్యమంత్రి జగన్ ఈనెల 4వ తేదీన బనగానపల్లెకు రానున్న నేపథ్యంలో పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ డా. కె. శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో సీఎం పర్యటన ఏర్పాట్లపై జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డితో కలిసి సమీక్ష నిర్వహించారు. డీఆర్వో పద్మజ, జడ్పీ డిప్యూటీ సీఈవో సుబ్బారెడ్డి, ఆర్డీవో శివారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూస్ ఎస్ఈ మనోహర్, ఆర్డీవోలు మల్లికార్జునరెడ్డి, మహేశ్వరరెడ్డి, మిరియాల దాసు సంబంధిత జిల్లా అధికారులు, తదితరలు పాల్గొన్నారు.

నంద్యాల టౌన్: త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ బూత్‌ల వద్ద ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగరాదని, పోలింగ్ బూత్‌ల వద్ద అన్ని మౌలిక సదుపాయాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత పర్యవేక్షణాధికారులను జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి ఆదేశించారు. శుక్రవారం నంద్యాల మున్సిపాలిటీ పరిధిలో మున్సిపల్ ప్రాథమిక పాఠశాల సత్రంబడి -2, మున్సిపల్ టౌన్ హాల్ -2, బొల్లెద్దుల వీధిలోని అనకలపేట -4, హరిజనవాడలోని గాంధీజీ మున్సిపల్ ప్రాథమిక పాఠశాల -3 పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి, సహాయ కమిషనర్ డాక్టర్ అంకిరెడ్డి, డీటీ రమాదేవి, జిల్లా విద్యాశాఖాధికారి సుధాకర్‌రెడ్డి, తదితరులు పట్టణంలోని పోలింగ్ బూత్‌ల వివరాలు, ఏర్పాట్లు, తదితర అంశాలను జేసీకి వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

డీఈవో నిర్ణయంపై ఆగ్రహం

నంద్యాల (నూనెపల్లె), మార్చి 1: జిల్లా విద్యాశాఖాధికారిగా వ్యవహరించకుండా అధికార పార్టీకి తొత్తులా వ్యవహరిస్తున్న డీఈవో తన పదవికి రాజీనామా చేసి రాజకీయాల్లోకి వెళ్ళాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రతాప్, ధనుంజయ్ ధ్వజమెత్తారు. శుక్రవారం వారు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బనగానపల్లె పర్యటన నేపథ్యంలో ఆదివారం సెలవు దినంలో పాఠశాలలు నిర్వహించాలని, సోమవారం సెలవును ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేయడాన్ని తప్పుబట్టారు. సీఎం పర్యటననకు, విద్యాశాఖకు సంబంధం ఏమిటని ప్రశ్నించారు. సీఎం సభలు ఉంటే ప్రతి సారీ విద్యాసంస్థలను ఇబ్బంది పెట్టడం, వారి వాహనాలను సభలకు తరలించడం సరికాదని హెచ్చరించారు. వెంటనే డీఈవో వైఖరిని మార్చుకోవాలని డిమాండ్ చేశారు.

● నంద్యాల జిల్లా విద్యాశాఖాధికారి సుధాకర్‌రెడ్డి వైఖరి ప్రభుత్వ ఏజెంట్‌ల ఉందని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫకృద్దీన్ అన్నారు. శుక్రవారం వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బనగానపల్లె పర్యటన సందర్భంగా ఆదివారం పాఠశాలలు నిర్వహించి సోమవారం సెలవు ప్రకటించాలని ఉత్తర్వులు జారీ చేయడం దుర్మార్గమైన చర్య అని వారు అన్నారు. రాష్ట్రంలో సెలవు దినమైన ఆదివారం ఏ పాఠశాలలు, ఏ కార్యాలయాల్లో తెరవటం ఉండదని, నంద్యాల డీఈవో సుధాకర్‌రెడ్డి జగన్ భజన కొడుతూ కొత్త ఒరవడిని తీసుకు రావడం సమజసం కాదని అన్నారు. దౌర్భాగ్యపు పనులు మానుకొని డీఈవో పదవికి రాజీనామా చేసి వైసీపీ కండువాను కప్పుకొని తిరగాలని హెచ్చరించారు.

'సంక్షేమ పథకాలు అమలు చేయాలి'

ఆత్మకూరురూరల్, మార్చి 1: భవన నిర్మాణ కార్మికుల కోసం ఏర్పాటు చేసిన సంక్షేమ బోర్డుకు రూ.2 వేల కోట్ల నిధులు కేటాయించి, కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్, ఏపీ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు నాగేశ్వరరావు, ఇస్మాయిల్ డిమాండ్ చేశారు. పట్టణంలోని లేబర్ కార్యాలయంలో అధికారి సారామార్గరేట్‌కు శుక్రవారం వినతి పత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో, సంక్షేమ బోర్డును సమర్థవంతంగా నిర్వహించడంలో నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. కార్మికుల సంక్షేమం కోసం కేటాయించిన రూ.2 వేల కోట్లను దారి మళ్లించి ఇతర అవసరాలకు వినియోగించుకోవడం సరికాదన్నారు. మరో వైపు కరోనా కాలం నుంచి నేటి వరకు భవన నిర్మాణ కార్మికులకు పనులు కల్పించడంలో, ఆదుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమన్నారు. తమిళనాడు, కేరళ, ఇతర రాష్ట్రాల్లో కార్మిక బోర్డు ద్వారా అనేక సంక్షేమ పథకాలు అమలు పరుస్తుంటే మన రాష్ట్రంలో అమలు చేయకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రఫీ, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

'సమస్యలపై నిరంతర పోరాటం'

నంద్యాల రూరల్, మార్చి 1: ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక పెన్షనర్ల సమస్యలపై నిరంతర పోరాటం కొనసాగిస్తామని ఎన్జీవోస్ అసోసియేషన్ ఉమ్మడి కర్నూలు జిల్లా అధ్యక్షుడు వీసీహెచ్ వెంగళ్ రెడ్డి, కార్యదర్శి బీసీ హుసేన్ రెడ్డి, నంద్యాల అసోసియేట్ అధ్యక్షుడు టి. మణిశేఖర్ రెడ్డి అన్నారు. రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్‌గా జిల్లాకు చెందిన దస్తగిరి రెడ్డి విజయవాడలోని రాష్ట్ర కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నిక కావడంపై హర్షం వ్యక్తం చేశారు.

'ఆరోగ్యానికి మించిన సంపద లేదు'

బండిఆత్మకూరు, మార్చి 1: ఆరోగ్యానికి మించిన సంపద మానవాళికి మరొకటి లేదని ఎంపీడీవో విజయరావు, డాక్టర్ భావన అన్నారు. మండలంలోని పార్నపల్లె జేఏఎస్ 2 శిబిరం శుక్రవారం సర్పంచ్ షేక్ షబ్బీర్ అహమ్మద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, అస్వస్థతకు గురైనా వెంటనే సమీపంలోని ప్రభుత్వ వైద్య కేంద్రాలకు వెళ్లి చికిత్సలు చేయించుకోవాలని సూచించారు. ప్రజలకు ఆరోగ్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. శిబిరాన్ని జిల్లా మలేరియా అధికారి కామేశ్వరరావు పరిశీలించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ శ్రీనివాసులు, వైస్ సర్పంచ్ రామలింగేశ్వరరెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, కార్యదర్శి వెంకటరాముడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు పల్స్ పోలియో

పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆదివారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు చేపడుతున్నట్లు డాక్టర్లు భావన, కిరణ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. జాతీయ పోలియో దినోత్సవాన్ని పురష్కరించుకుని బండిఆత్మకూరు, నారాయణపురం గిరిజన ఆరోగ్య కేంద్రాల పరిధిలోని సుమారు 6వేల మంది పిల్లలకు పోలియో చుక్కలు వేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

'పేదలకు మెరుగైన వైద్య సేవలు'

కొత్తపల్లి, మార్చి 1: ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని జడ్పీటీసీ సోమల సుధాకర్‌రెడ్డి, ఎంపీడీవో జవహర్‌బాబు, సర్పంచ్ విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. శుక్రవారం కొక్కెరంచ గ్రామంలో డా.విజయేంద్ర ఆధ్వర్యంలో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష ముగింపు క్యాంపు నిర్వహించారు. 410 మంది వైద్యసేవలను సద్వినియోగం చేసుకున్నారని, 31 మందికి దృష్టిలోప నిర్ధారణ పరీక్షలు చేయించుకున్నారని తెలిపారు. అలాగే బీపీ, షుగర్, జ్వరం, రక్త, గుండె, కంటి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. వైద్యనిపుణులు రాయుడు, డా.జుబేదా, స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ నారాయణ ఆచారి, వైసీపీ నాయకులు నాగరత్నం పాల్గొన్నారు.

'ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలి'

వెలుగోడు, మార్చి 1: వెలుగోడు ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతిలో ప్రవేశానికి విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ నళిని తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ 2024-25 విద్యా సంవత్సరానికి గానూ ఈ నెల 21న ఉదయం 10 గంటలకు ప్రవేశ పరీక్ష ఉంటుందని చెప్పారు. ఓసీ, బీసీ విద్యార్థులు 2012 సెప్టెంబరు 1 నుంచి 2014 ఆగస్టు 31 మధ్య, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 2010 సెప్టెంబరు 1 నుంచి 2014 ఆగస్టు 31 మధ్య జన్మించి వారు అర్హులని తెలిపారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 5వ తరగతి చదివి ఉండాలని, ఈ నెల 31వ తేది నాటికి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని తెలిపారు.

పాములపాడు: మండల కేంద్రమైన మోడల్ స్కూల్‌లో ఆరో తరగతి ప్రవేశ పరీక్షకు ఆసక్తిగల విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ నాగరవీంద్ర తెలిపారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 5వ తరగతి చదివి ఉండాలని, 31 వరకు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలన్నారు.

మద్యం దుకాణం మూసివేయించారు



నంద్యాలలో వైన్ షాపును మూసివేయించిన మహిళలు

నంద్యాల (నూనెపల్లె), మార్చి 1: మద్యంపై యుద్ధానికి మేము సిద్ధమంటూ నిషేదానికి నీవు సిద్ధమా జగన్‌మోహన్‌రెడ్డి అంటూ ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో శుక్రవారం నంద్యాలలోని సాయిబాబానగర్ సెంటర్‌లో ధర్నా చేశారు. సమీపంలోని ప్రభుత్వ వైన్స్ షాపు ఎదుట నిరసన చేపట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వైన్స్ షాపును మూయించారు. సమాఖ్య జిల్లా నాయకురాలు రజిత, షమీమ్ బేగం మాట్లాడుతూ విడతల వారిగా మద్యాన్ని నిషేధిస్తామని చెప్పి మాటతప్పిన జగనన్న ప్రభుత్వానికి మహిళలు ఓట్లు వేయరని హెచ్చరించారు. ఇచ్చిన వాగ్దానానికి కట్టుబడి ఉండకుండా విచ్చలవిడిగా మద్యం షాపుల ద్వారా మద్యాన్ని విక్రయించడం ఎంత వరకు సమంజసమని వారు ప్రశ్నించారు. నాసిరకం మద్యంతో ప్రజలు మరణిస్తున్నా జగన్‌మోహన్‌రెడ్డి కళ్లు తెరుచుకోవడంలేదని ఎద్దేవా చేశారు.

'టీడీపీతోనే అభివృద్ధి'



నందికొట్కూరులో ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

నందికొట్కూరు, మార్చి 1: టీడీపీతోనే అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ జయసూర్య అన్నారు. పట్టణంలోని 13వ వార్డులో శుక్రవారం 'బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి టీడీపీ మినీ మేనిఫెస్టో గురించి వివరించారు. జయసూర్య మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రస్తుతం వైసీపీ రాక్షస పాలన కొనసాగిస్తోందని, ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నా రని అన్నారు. వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, ముర్తుజావలి, జాకీర్ హుసేన్, మీనాక్షిదేవి, లక్ష్మి, రుబియా, శ్రీకాంత్‌గౌడ్, వేణుగోపాల్, చింత గోపాల్, భరత్, మల్లికార్జునరెడ్డి, సత్తార్ మియ్యా, కళాకర్ తదితర నాయకులు పాల్గొన్నారు.

'31లోపు పన్నులు చెల్లిస్తే వడ్డీ మాఫీ'

నంద్యాల టౌన్, మార్చి 1: మున్సిపాలిటీ పరిధిలో ఇంటి పన్నులు, ఖాళీ స్థలాలపై పన్నుల బకాయిలను ఏక మొత్తంగా ఈనెల 31వ తేదీ లోపు చెల్లించే వారికి పెండింగ్ బకాయిపై ఉన్న వడ్డీని పూర్తిగా మాఫీ చేస్తామని మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు 2023- 2024 ఆర్థిక సంవత్సరం వరకు ఉన్న పన్నుల బకాయిలపై వడ్డీని మాఫీ చేయనున్నట్లు తెలిపారు. నంద్యాల పట్టణంలోని ప్రజలు ఈ విషయాన్ని గమనించి వడ్డీ మాఫీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మున్సిపల్ కార్యాలయ పని దినాలలో నేరుగా కట్టవచ్చునని, అలాగే వార్డు సచివాలయాలు, మున్సిపల్ కార్యాలయంలోని ప్రత్యేక కౌంటర్‌లలో కూడా చెల్లించవచ్చునని తెలిపారు. సెలవు దినాల్లో కూడా ప్రత్యేక కౌంటర్లు పని చేస్తాయని, ఆన్‌లైన్ ద్వారా కూడా పన్నులను చెల్లించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

ఆర్జీఎంలో సంకల్ప్ 2024 సదస్సు ప్రారంభం

పాణ్యం, మార్చి 1: మండలంలోని ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజుల సంకల్ప్ 2024 సాంకేతిక సదస్సు శుక్రవారం ప్రారంభమైనట్లు సంకల్ప్ కన్వీనర్ డాక్టర్ తిరుపతిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం నిర్వహించే ఈ కార్యక్రమంలో శుక్రవారం హైదరాబాదు వీడాల్ ఇంటర్ నేషనల్ నాన్ డెస్ట్రక్టివ్ టెస్టింగ్ అండ్ ఎవల్యూషన్, కంప్యూటర్ న్యూమరికల్ కంట్రోల్ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సాంకేతిక పత్రాల సమర్పణ, క్విజ్, వ్యాస రచన, డ్రాయింగ్, టెక్నాలజీలపై పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జయచంద్రప్రసాద్, డాక్టర్ రామిరెడ్డి, కన్వీనర్ డాక్టర్ మనోజ్ పాంచాల్, విద్యార్థులు, మెకానికల్ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

'షాజహాన్‌పై చర్యలు తీసుకోవాలి'

నంద్యాల (కల్చరల్), మార్చి 1: పశ్చిమబెంగాల్ రాష్ట్రంలోని సందేశ్‌కాళీలో తృణమూల్ కాంగ్రెస్ నేత, ఎమ్మెల్యే షాజహాన్ షేక్‌పై చర్యలు తీసుకోవాలని బీజేపీ నంద్యాల నియోజకవర్గ కన్వీనర్ అభిరుచి మధు డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే షేక్ షాజహాన్ అనుచర దళం గత కొంతకాలంగా ఎస్సీ, గిరిజన ప్రాంతాలకు వెళ్లి సర్వేల పేరుతో గిరిజనుల భూములను ఆక్రమిస్తూ వారి భూములను చెరువులుగా తయారు చేశారన్నారు. మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడడం దారుణమన్నారు. దీన్ని ఖండిస్తూ తృణమూల్ కాంగ్రెస్ నేత మమతా బెనర్జీ దిష్టి బొమ్మను దహనం చేశారు. అలాగే రాస్తారోకో నిర్వహించారు. నాయకులు మురళి, కశెట్టి చంద్ర, రమేష్, ఉపేంద్ర, లక్ష్మీరెడ్డి, సాయి, ఎస్సీ రాష్ట్ర మోర్చా కార్యవర్గ సభ్యులు బాలమణి, స్వాతి, అరుణ, మధుర పాల్గొన్నారు.

'అప్రెంటిస్‌షిప్ విధానాన్ని రద్దు చేయాలి'

గోస్పాడు, మార్చి 1: డీఎస్సీ నియామకాల్లో రాష్ట్ర ప్రభుత్వం అప్రెంటిస్‌షిప్ విధానాన్ని ప్రవేశపెట్టతామనడం సరైనది కాదని, దానిని రద్దు చేయాలని పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. గోస్పాడులోని పీఆర్‌టీయూ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో వేసవి తీవ్రత దృష్ట్యా మార్చి 15 నుంచి ఒంటి పూట బడులు నిర్వహించాలని కోరారు. పదో తరగతి పరీక్షా కేంద్రాలలో విద్యార్థులకు ఉదయం పూటనే తరగతులు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ నాయకులు విజయరావు, సురేష్‌శర్మ, సుబ్బరాయుడు నాయక్, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మహానందీశ్వరుడి పల్లకీ సేవ



పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

మహానంది, మార్చి 1: మహానంది క్షేత్రంలో శుక్రవారం రాత్రి ప్రత్యేక పల్లకీపై మహానందీశ్వరుడి ఉత్సవాన్ని ఆలయ వేదపండితులు, అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మంటపంలో మహానందీశ్వర స్వామి, కామేశ్వరీదేవి అమ్మవార్ల ఉత్సమూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీపై అర్చకులు ఆశీనులు చేశారు. అనంతరం ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల శివనామస్మరణ మధ్య పల్లకీ ఉత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో స్వాతి నక్షత్ర వేడుకలు

నంద్యాల (కల్చరల్), మార్చి 1: నంద్యాల తెలుగుపేటలో వెలసిన మద్దులేటి లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో శుక్రవారం స్వామివారి జన్మనక్షత్రమైన స్వాతి సందర్భంగా స్వాతి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ వేడుకలలో భాగంగా స్వామివారికి ఉదయం పంచామృతాభిషేకం, స్నపన తిరుమంజనం నిర్వహించారు. అనంతరం స్వామివారికి పట్టు వస్త్రాలు, పూలమాలలతో అలంకరించి నైవేద్యం సమర్పించి మహా మంగళ హారతి ఇచ్చారు. కార్యక్రమంలో అర్చకులు శ్రీరామమూర్తి, భక్తులు పాల్గొన్నారు.

కమనీయం.. కల్యాణం

నంద్యాల (కల్చరల్), మార్చి 1: నంద్యాల పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో వెలసిన అమ్మ స్ఫటిక లింగేశ్వరాలయంలో శుక్రవారం మాఘమాసం బహుళషష్టి సందర్భంగా వల్లీదేవసేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. అర్చకులు చంద్రశేఖర్ శర్మ, నిర్వహకులు యోగానంద ఆధ్వర్యంలో కల్యాణాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు, యోగా సభ్యులు పాల్గొన్నారు.

పింఛన్ డబ్బులో పన్నులు పట్టుకున్నారు

● వలంటీర్ల నిర్వాకం

గడివేముల, మార్చి 1: వృద్ధులు, దివ్యాంగులకు, వితంతువులకు ఇవ్వాల్సిన పింఛన్‌లను ఇంటి పన్నుకు జమ చేస్తున్న వైనం గడివేముల మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే మండలంలోని పెసరవాయి గ్రామంలో శుక్రవారం వలంటీర్లు వృద్ధులకు, దివ్యాంగులకు, వితంతువుల ఇళ్లకు వెళ్లి పింఛన్ లబ్ధిదారుల బయోమెట్రిక్ తీసుకున్నారు. పింఛన్ నగదు లబ్ధిదారులకు ఇవ్వాల్సి ఉండగా ఇంటి పన్ను, నీటి పన్ను బకాయి ఉందని పింఛన్ నగదును పన్ను బకాయిలకు జమ చేశారు. దీంతో పింఛన్ లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేశారు. పింఛన్ నగదుతోనే నెలంతా కాస్త ఉపశమనం పొందే వృద్ధులకు పన్నుల పేరుతో పింఛన్ నగదును జమ చేయడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. పంచాయతీ కార్యదర్శులు లేకుండానే వలంటీర్లే ఇంటి పన్ను వసూలు చేసి రసీదులు ఇస్తుండటంతో గ్రామంలో చర్చనీయంశంగా మారింది. ఎంపీడీవో శివరామిరెడ్డిని వివరణ కోరగా పింఛన్ డబ్బులు పన్నులకు జమ చేసుకోరాదని అన్నారు. పెసర వాయి గ్రామంలో జరిగిన ఘటనపై విచారించి చర్యలు తీసుకుంటామన్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా సుధాకర్‌రెడ్డి



కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న సుధాకర్‌రెడ్డి

నందికొట్కూరు, మార్చి 1: నందికొట్కూరు మున్సిపల్ నూతన కమిషనర్‌గా టి.సుధాకర్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, కార్యాలయ సిబ్బంది కమిషనర్‌కు బొకేలతో స్వాగతం పలికారు. కమిషనర్ మాట్లాడుతూ నందికొట్కూరు మున్సిపాల్టీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. ప్రధానంగా ఉన్న తాగునీటి సమస్యకు నాయకుల సహకారంతో పరిష్కారం చూపుతామన్నారు.

సంచుల కోసం రైతుల ఆందోళన



బూజనూరు బాట వద్ద బైఠాయించిన పెసరవాయి రైతులు

గడివేముల, మార్చి 1: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సంచులు లేక అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. చేతికొచ్చిన పంటను విక్రయించేందుకు రైతు భరోసా కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. పూర్తిస్థాయిలో గోనే సంచులు పంపిణీ చేయకపోవడంతో శుక్రవారం పెసరవాయి రైతు భరోసా కేంద్రం వద్ద రైతులు ఆందోళనకు దిగడంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. మండలంలో 8 వేల ఎకరాల్లో రైతులు జొన్న పంటను సాగు చేశారు. ధాన్యం కొనుగోలు చేసేందుకు మొదటి విడతగా మండలానికి ప్రభుత్వం 25 వేల గోనే సంచులను పంపిణీ చేయగా రైతులు కొంత ధాన్యాన్ని విక్రయించారు. పూర్తిస్థాయిలో ధాన్యాన్ని విక్రయించేందుకు గోనే సంచులు లేక రైతులు అవస్థలు పడుతున్నారు. ఇదిలా ఉండగా శుక్రవారం రెండో విడతగా మరో 20 వేలు గోనే సంచులు మండలానికి పంపిణీ చేశారు. ఇందులో పెసరవాయి గ్రామానికి 7 వేల గోనే సంచులను పంపిణీ చేశారు. అయితే ఇవి సరిపోవని పెసరవాయి గ్రామ రైతులు ఆందోళనకు దిగారు. రైతు భరోసా వద్ద బైఠాయించారు. ఆర్‌బీకే వద్ద ఉద్రిక్తత నెలకొనడంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. మండలంలోని పైబోగుల గ్రామంలో సోలార్ ప్రాజెక్టు కోసం భూములు పరిశీలించేందుకు జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి వచ్చారని సమాచారం రావడంతో గోనే సంచుల కొరత జేసీ దృష్టికి తీసుకెళ్లేందుకు రైతులు పెసరవాయి బాట వద్ద రోడ్డుపై బైఠాయించారు. జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి ఈ మార్గంలో రాకపోవడంతో వెనుతిరిగారు. అధికారులు స్పందించి గోనే సంచల కొరతను పరిష్కరించాలని రైతులు డిమాండ్ చేశారు.

సోలార్ విద్యుత్ ప్రాజెక్టుకు భూముల పరిశీలన

గడివేముల, మార్చి 1: మండలంలోని చెనకపల్లి గ్రామంలో సోలార్ విద్యుత్ ప్రాజెక్టును ఏర్పాటుకు శుక్రవారం జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి భూములను పరిశీలించారు. చెనకపల్లి రెవెన్యూ పరిధిలోని 930 ఎకరాల అన్‌రిజర్వ్ భూముల వివరాలను డిప్యూటీ తహసీల్దార్ గురున్నాథంను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పైబోగుల గ్రామంలో రైతులతో సమావేశమయ్యారు. గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని ప్రజలు జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డిని కోరారు. తాగునీటి సమస్య పరిష్కరించాలని జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి ట్యాంకర్లు ప్రారంభం

నందికొట్కూరు, మార్చి 1: నందికొట్కూరు పట్టణంలో మున్సిపల్ కార్యాలయానికి నీటి ట్యాంకర్లను శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, కమిషనర్ సుధాకర్‌రెడ్డి ప్రారంభించారు. సిద్ధార్థరెడ్డి మాట్లాడుతూ నిరంతరాయంగా ప్రజలకు నీటిని సరఫరా చేసేందుకు సమన్వయకర్త దార సుధీర్ రెండు మంచి నీటి సరఫరా ట్యాంకర్లను మున్సిపల్ కార్యాలయానికి అందజేశారని చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

సున్నా చుట్టేశారు..!

జగనన్నా ఇదేం అన్యాయం అంటున్న రైతులు

- సాధ్యం కాని నిబంధనలతో సున్నా వడ్డీకి తూట్లు
- పంట రుణాలపై రైతులే ముందుగా వడ్డీ చెల్లించాలి
- ఆ తర్వాత ఏడాదికి ప్రభుత్వం తిరిగి చెల్లింపు
- 2023 ఖరీఫ్ వడ్డీని ఎప్పుడు చెల్లిస్తారో తెలియని రైతులు







ఈ రైతు పేరు రాముడు. వెల్దుర్తి మండలం కొసరాపల్లికి చెందిన ఈ రైతు తనకున్న మూడెకరాల్లో వ్యవసాయం చేసుకొని జీవిస్తున్నాడు. పంట సాగు కోసం వెల్దుర్తిలోని రాయలసీమ గ్రామీణ బ్యాంకులో ఏటా రుణం తీసుకునే వాడు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఈ రైతు తీసుకున్న పంట రుణానికి ప్రభుత్వమే వడ్డీ చెల్లించింది. పంట అమ్మిన తర్వాత రైతు బ్యాంకులో అప్పు తీర్చాడు. టీడీపీ అధికారంలోంచి పోయి వైసీపీ వచ్చాక పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఈ రైతు మొదటే వడ్డీ చెల్లించాల్సి వచ్చింది. ముందు రైతు వడ్డీ చెల్లిస్తే ఆ తర్వాత ప్రభుత్వం బ్యాంకులో రైతు ఖాతాకు జమ చేస్తుందని జీవోను 2019 చేసింది. దీంతో ఈ రైతు గత నాలుగు సంవత్సరాలుగా సున్నా వడ్డీ తనకు అందుతుందో లేదోనని ఆందోళన చెందాల్సి వచ్చింది. రెండు రోజుల క్రిందట ప్రభుత్వం విడుదల చేసిన సున్నా వడ్డీ తన బ్యాంకు ఖాతాకు జమ అయిందో లేదోనని రాయలసీమ గ్రామీణ బ్యాంకులో ఆరా తీస్తున్నాడు. అయితే.. ఇంకా నిధులు జమ కాలేదని బ్యాంకు అధికారులు చెప్పారు. రాముడు అనుభవించిన ఇబ్బందిని కర్నూలు, నంద్యాల జిల్లాలోని నాలుగున్నర లక్షల మంది రైతులు ఎదుర్కొంటున్నారు.

కర్నూలు(అగ్రికల్చర్), మార్చి 1: కర్నూలు, నంద్యాల జిల్లాలో దాదాపు 6 లక్షల మందికి పైగా రైతులు ఉన్నారు. వీరు కొద్దిపాటి పంట దిగుబడికైనా గిట్టుబాటు ధర అందుతుందో లేదోనని ఆందోళన చెందుతున్నారు. పంట సాగు కోసం ఏటా ఖరీఫ్, రబీ సీజన్లలో దాదాపు 5 లక్షల మంది రైతులు కర్నూలు జిల్లాలో పంట రుణాలను వివిధ బ్యాంకుల్లో తీసుకుంటున్నారు. రూ. లక్షలోపు పంట రుణం తీసుకున్న రైతుల తరపున 7 శాతం వడ్డీని అంటే.. రూ.7వేలను ప్రభుత్వమే చెల్లించే వెసులుబాటు గత టీడీపీ ప్రభుత్వం కల్పించింది. రైతులు మార్చిలోగా అసలు చెల్లిస్తే సరిపోయేది. ముఖ్యమంత్రిగా జగన్ బాధ్యతలు చేపట్టిన తర్వాత ఈ పథకం అమలులో సాధ్యంకానీ నిబంధనలను పెట్టారు. రెండు రోజుల కింద సీఎం జగన్ తాడేపల్లి క్యాంపు ఆఫీసు నుంచి సున్నా వడ్డీ కింద 2021-22 రబీ సీజన్, 2022-23 ఖరీఫ్ సీజన్‌లో పంట రుణాలు తీసుకున్న రైతులకు సున్నా వడ్డీ పథకానికి అర్హులైన రైతులకు రీయింబర్స్‌మెంటు చేస్తూ అట్టహాసంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అయితే.. ఉమ్మడి జిల్లాలో కేవలం పంట రుణాలు తీసుకున్న నాలుగున్నర లక్షల మంది రైతులకు గాను కేవలం 10 శాతం మంది రైతులకే అంటే.. 1.30 లక్షల మంది రైతులను మాత్రమే సున్నా వడ్డీ పథకానికి అర్హులుగా తేల్చారు. దీంతో మిగిలిన మూడున్నర లక్షల మంది రైతులుసున్నావడ్డీ కోసం వ్యవసాయ శాఖ కార్యాలయాలకు, బ్యాంకులకు పరుగులు తీశారు. కర్నూలు జిల్లాలో 2021-22, 2022-23 సంవత్సరం ఖరీఫ్‌లో 76,831 మంది రైతులకు మాత్రమే రూ.18.21 కోట్ల సున్నావడ్డీ నిధులను వారి బ్యాంకు ఖాతాలకు జమ చేశారు. అదే విధంగా నంద్యాల జిల్లాలో కేవలం 54,376 మంది రైతులకు మాత్రం రూ.11.08 కోట్లును రైతులకు విడుదల చేశారు. వాస్తవంగా రెండు జిల్లాల్లో నాలుగున్నర లక్షల మంది రైతులు దాదాపు ఖరీఫ్, రబీ సీజన్లలో 6 లక్షల దాకా పంట రుణాలు తీసుకున్నారు. అనవసర నిబంధనలు లేకుంటే అర్హులందరికీ న్యాయం జరిగేది. నాలుగున్నర లక్షల మందికి సున్నా వడ్డీ పథకం అమలయ్యేది.

సాధ్యం కానీ నిబంధనలతో సున్నా వడ్డీకి తూట్లు

వైసీపీ ప్రభుత్వం సాధ్యం కాని నిబంధనలు విధించడంతో అర్హులైన రైతులు సున్నా వడ్డీ పథకానికి అనర్హులయ్యారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో నాలుగున్నరలక్షల మంది ఏటా ఖరీఫ్, రబీ సీజన్లలో పంట రుణాలను తీసుకుంటున్నారు. రైతులు పంట రుణాలు తీసుకున్న తర్వాత ఆ పంట సీజన్ ముగిసిన తర్వాత మార్చిలోగా వడ్డీని చెల్లిస్తేనే సున్నా వడ్డీ పథకానికి అర్హులవుతారు. ఆ తర్వాత ఏడాది తర్వాత నింపాదిగా ప్రభుత్వం రైతుల బ్యాంకు ఖాతాలకు నిధులను జమ చేస్తోంది. రైతులు పంట రుణం తీసుకునే సమయంలో బ్యాంకులో ఏ పంటను సాగు చేసినట్లు చూపుతారో.. అదే పంట పొలంలో ఉండాలి. ఈ మేరకు ఈక్రాప్‌తో పాటు ఈకేవైసీ చేయించాల్సిందే. లేకపోతే రైతులు పంట రుణంపై వడ్డీని చెల్లించినా ప్రభుత్వం మాత్రం సున్నా వడ్డీని రైతులకు జమ చేయదు. ఈ విధానాన్ని రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. 2021-22 రబీ సీజన్‌తో పాటు 2022-23 ఖరీఫ్ సీజన్‌లో రైతులు తీసుకున్న పంట రుణాలకు సంబంధించి రెండు రోజుల క్రితం ప్రభుత్వం సున్నా వడ్డీ నిధులను జమ చేసింది.

2023లో తీసుకున్న పంట రుణాలకు వడ్డీ చెల్లించాలని రైతులపై ఒత్తిడి

2023లో ఖరీఫ్, రబీ సీజన్‌లలో ఉమ్మడి జిల్లాలో నాలుగున్నర లక్షల మంది రైతులు వివిధ బ్యాంకుల్లో పంట రుణాలు తీసుకున్నారు. ఈ రైతులంతా మార్చి నెలాఖరులోగా వడ్డీ చెల్లించాలని, లేకపోతే అసలుతో కలిపి చక్రవడ్డీని వసూలు చేస్తామంటూ బ్యాంకు అధికారులు అంటున్నారు. అసలే పంటలు లేక నష్టాల పాలై జీవనోపాధి కోసం పక్క రాష్ట్రాలకు వలస వెళ్తున్న తమపై ఏమాత్రం కనికరం లేకుండా వెంటనే వడ్డీ చెల్లించాలని బ్యాంకులు ఒత్తిడి చేస్తే.. తాము ఎక్కడి నుంచి కట్టాలని ప్రశ్నిస్తున్నారు.



ఇదీ చాలా దారుణం

ఈ సంవత్సరం ప్రకృతి వైపరీత్యాల వల్ల ఆశించిన స్థాయిలో పంట చేతికందలేదు. పెట్టుబడి కూడా వస్తుందో రాదో తెలియడం లేదు. దీంతో పంట సాగు కోసం తీసుకున్న రుణాన్ని చెల్లించలేకపోతున్నాను. ఈ పరిస్థితుల్లో ఆ రుణంపై వడ్డీని మార్చి నెలాఖరులోగా చెల్లించాలని బ్యాంకు అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే అప్పులపాలైన మేము మళ్లీ అప్పులు చేసి వడ్డీ ఎట్లా కట్టాలి?

-మాణిక్యం, రైతు, పుట్లూరు, క్రిష్ణగిరి

అర్హులందరికీ సున్నావడ్డీ పథకం అమలైంది

ఐదో ఏడాది మూడో విడతగా కర్నూలు జిల్లాలో సున్నా వడ్డీ పథకం కింద 36,831 మంది రైతుల ఖాతాలకు రూ.18.21 కోట్లును జమ చేశాం. అర్హులైన రైతులందరికీ ఈ పథకాన్ని వర్తింపజేశాం. రైతులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

- వరలక్ష్మి, జేడీ, వ్యవసాయ శాఖ



రూ.3.16 కోట్లతో గురు నివాస్ భవనం



రూ.3.16 కోట్లతో నిర్మాణంలో ఉన్న గురు నివాస్ మందిరం

మంత్రాలయం, మార్చి 1: మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం వెనుకాల తుంగభద్ర నది ఒడ్డున బెంగళూరుకు చెందిన అశ్వథ్థనారాయణ అనే భక్తుడు రూ.3.16 కోట్లతో గురునివాస్ భవన నిర్మాణం పనులు చేపట్టారు. పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు దగ్గరుండి పనులను పర్యవేక్షిస్తున్నారు. మఠం ఈఈ సురేష్ కోనాపూర్, ఏఈ బద్రినాథ్ పర్యవేక్షణలో కాంట్రాక్టరు ఓబులయ్య, సైట్ ఇంజనీర్ ఉబ్బ శ్రీనివాసులు పర్యవేక్షణలో పనులు చురుగ్గా సాగుతున్నాయి. మఠం ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, వెంకటేశ్ జోషిలు నిర్మాణ పనులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు. రాఘవేంద్రస్వామి దర్శనార్థం వచ్చిన వివిధ మఠాధిపతులకు నివాసాలు ఉండే విధంగా రెండు గదులు, వారి మఠం సాంప్రదాయాల ప్రకారం నిర్వహించే రెండు పూజా మందిరాలు వారి శిష్యులకు ఆరు గదులు, ప్రత్యేకమైన వంట గదులను తీర్చిదిద్దుతున్నారు. ఇందులో మొదటి, రెండు అంతస్థులుగా ఆధునికీరణ, సుందరీకరణ, తులసివనం, నది ఒడ్డున ఆహ్లాదకరమైన వాతావరణంలో ఈ భవనాన్ని రూపొందిస్తున్నారు.

పది పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి: డీఈవో

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 1: మార్చి 18వ తేదీ నుంచి జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి సామ్యూల్ అన్నారు. శుక్రవారం ఎ.క్యాంపు మాంటిస్సోరి పాఠశాలలో పది పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంట్ ఆఫీసర్లు, అడిషినల్ సూపరింటెండెంట్లకు పరీక్షలపై వర్క్‌షాపు జరిగింది. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ పరీక్షలో ఎలాంటి మాస్ కాపీయింగ్‌కు, చూచి రాతలకు తావివ్వరాదన్నారు. పరీక్ష కేంద్రాల్లో పొరపాట్లు జరిగితే అందుకు సంబంధించిన నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో రాష్ట్ర పరిశీలకులు గీత, ఉప విద్యాశాఖ అధికారి హనుమంతరావు, జిల్లా పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ చంద్రభూషణ్, డీసీఈబీ సెక్రటరీ నాగరాజు, చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంటల్ ఆఫీసర్లు అడిషినల్ చీఫ్ సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

కదిలిన ఉపాధి అధికారులు

ఆంధ్రజ్యోతి కథనంతో క్షేత్ర స్థాయి పరిశీలన



ఆరేకల్లులో ఉపాధి కూలీలు పనిచేసే చోట విచారణ చేస్తున్న అధికారులు

ఆదోని రూరల్, మార్చి 1: ఉపాధి హామీ అధికారులు పొలాల బాట పట్టారు. 'నిధులు దోచేశాడు' అనే కథనానికి స్పందించి క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి ఆదేశాల మేరకు ఏపీడీ లోకేశ్, ఏపీఓ ఖాలిక్ అబ్దుల్ శుక్రవారం 10గంటల కల్లా ఆరేకల్లుకు చేరుకున్నారు. వైసీపీ సీనియర్ నాయకుడు, విద్యా కమిటీ చైర్మన్ నాగరాజు, వైసీపీ కాంట్రాక్టర్ రామిరెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ గోపాల్ సమక్షంలో ఉపాధి అధికారులు పొలంబాట పట్టారు. పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి విచారణ చేశారు. ముందుగానే వైసీపీ నాయకులు కూలీలకు ట్రైనింగ్ ఇవ్వడంతో ఆ ప్రకారమే అధికారులకు సమాధానం ఇచ్చుకుంటూ పోయారు.

ఎండు మిర్చి ధర పతనం

క్వింటం గరిష్ఠంగా రూ.12,800



విక్రయానికి వచ్చిన ఎండు మిర్చి బస్తాలు

ఆదోని (అగ్రికల్చర్), మార్చి 1: ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఎండు మిర్చి ధరలు శుక్రవారం భారీగా పతనమయ్యాయి. గతవారంతో పోల్చితే ధరలు సగానికి దిగజారాయి. ఎండుమిర్చి సింజింటా రకం క్వింటం అధికంగా రూ.12,800 పలికింది. ధర పతనం కావడంతో మిర్చి రైతులు ఆందోళన చెందుతున్నారు. మిర్చి సాగుకు ఎకరానికి రూ.వేల పెట్టుబడులు పెట్టి సాగు చేస్తే పెట్టుబడి ఖర్చులు కూడా రాని పరిస్థితి నెలకొందని రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారు. బ్యాడిగి రకం మిర్చి క్వింటాలు కనిష్ట ధర రూ.5,600, గరిష్ఠ ధర రూ.12,269, సిజెన్టా రకం మిర్చి క్వింటాలు కనిష్ఠంగా రూ.5,506, గరిష్ఠంగా రూ.12,800, 5531 రకం మిర్చి క్వింటాలు కనిష్ఠంగా రూ.5,401, గరిష్ఠంగా రూ.10,200, సూపర్ టెన్ రకం గరిష్ఠంగా రూ.11,569 పలికింది.

రాయలసీమ ద్రోహి జగన్‌రెడ్డి

రాయలసీమ విద్యార్థి, యువజన సంఘాల జేఏసీ చైర్మన్ బి. శ్రీరాములు



సమవేశంలో మాట్లాడుతున్న ఆర్‌యూ జేఏసీ చైర్మన్

కర్నూలు(అర్బన్), మార్చి 1: వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రాయలసీమకు న్యాయ రాజధాని ఇస్తానని చెప్పి నయవంచన చేశాడని రాయలసీమ విద్యార్థి, యువజన సంఘాల జేఏసీ చైర్మెన్ బీ. శ్రీరాములు అన్నారు. శుక్రవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. రాయలసీమలో ఒక్క పరిశ్రమ కూడా ఏర్పాటు చేయలేదని అన్నారు. కేంద్రం అనుమతి లేకుండా కర్నూలులో న్యాయ విశ్వవిద్యాలయానికి ఏ విధంగా భూమి పూజ చేస్తారని నిలదీశారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే తప్ప రాయలసీమ కరువు సమస్య తీరదని, రాయలసీమలో పరిశ్రమలు కావాలంటే చంద్రబాబు మరో సారి ముఖ్యమంత్రి కావాలన్నారు. ఈ నెల 12న కర్నూలు నగరంలో రాయలసీమలోని నిరుద్యోగులు, విద్యావంతులతో రాయలసీమ గర్జన నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, సురేంద్ర, రాజు, భరత్, రవి, సాయి, సోము, చందు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు జీజీహెచ్ ఏవోగా ఎం.శ్రీనివాసులు



ఏవోకు అభినందనలు తెలుపుతున్న ఆసుపత్రి సూపరింటెండెంట్

కర్నూలు(హాస్పిటల్), మార్చి 1: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఏవోగా ఎం.శ్రీనివాసులు శుక్రవారం ఉదయం బాధ్యతలు చేపట్టారు. కర్నూలు నర్సింగ్ కాలేజీలో సెక్షన్ సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న ఆయనకు మూడు రోజుల క్రితం డైరెక్టర్ ఆఫ్ హెల్త్ విజయవాడలో పదోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆయనకు ఏవోగా పదోన్నతి కల్పించి కర్నూలు జీజీహెచ్‌లో పోస్టింగ్ వేశారు. ఈ మేరకు కొత్త ఏవో ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.వి.వెంకటరంగారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో ఆసుపత్రి ఏడీ అనిల్ కుమార్ రెడ్డి, ఆఫీసు సూపరింటెండెంట్లు కుమారస్వామి, లతీఫ్, సీనియర్ అసిస్టెంట్లు చిరంజీవి, రాజశేఖర్, నాగజయంతి పాల్గొన్నారు.

ఘాట్ రోడ్డులో ట్రాఫిక్ జామ్

- అదుపు తప్పి ఆర్టీసీ బస్సును ఢీ కొన్న లారీ
- దాదాపు గంటన్నరపాటు ఆగిపోయిన వాహనాలు

ఆత్మకూరు రూరల్, మార్చి 1: ఆత్మకూరు మండలంలోని కర్నూలు గుంటూరు జాతీయ రహదారిలోని రోళ్లపెంట ఘాట్ రోడ్డులో శుక్రవారం మధ్యాహ్నం ఓ లారీ అదుపు తప్పి ఆర్టీసీ బస్సును ఢీ కొన్నది. దీని వల్ల ట్రాఫిక్ నిలిచిపోయింది. ఆత్మకూరు నుండి శ్రీశైలానికి ప్రయాణికులతో వెళుతున్న ఆర్టీసీ బస్సును, దోర్నాల నుంచి ఆత్మకూరు వైపుగా వస్తున్న ఓ లారీ అదుపు తప్పి రోళ్ల పెంట ఘాట్ రోడ్డులోని ఓ మలుపు వద్ద ప్రమాదవశాత్తు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయట పడ్డారు. రోడ్డుకు అడ్డంగా లారీ నిలబడి పోవడంతో కర్నూలు గుంటూరు జాతీయ రహదారిపై రోళ్లపెంట వద్ద దాదాపు గంటన్నర పాటు ట్రాఫిక్ జామ్ అయింది. దీంతో సమాచారం అందుకున్న ఆత్మకూరు ఎస్ఐ నారాయణరెడ్డి సంఘటనా స్థలం చేరుకుని ప్రమాదానికి గురైన ఆర్టీసీ బస్సును, లారీని ప్రయాణికుల సహాయంతో పక్కకు జరిపి రోడ్డును క్లియర్ చేశారు. కాగా గుంటూరు, విజయవాడ, శ్రీశైలం, చీరాల, ఒంగోలు, మార్కాపురం, వైజాక్, కాకినాడ, రాజమండ్రి తదితర ప్రాంతాలకు వెళ్ళే బస్సులు, వివిధ వాహనాలు ఆగిపోయి ప్రయాణికులు అవస్థలు పడ్డారు.



ట్రాఫిక్ జామ్ కావడంతో అవస్థలు పడుతున్న ప్రయాణికులు

హైస్కూల్ హెచ్‌ఎం సస్పెన్షన్

బనగానపల్లె, మార్చి 1: బనగానపల్లె పట్టణంలోని కొండపేట జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం జానకిని సస్పెండ్ చేసినట్లు ఎంఈవో స్వరూప శుక్రవారం తెలిపారు. ఈ మేరకు చేస్తూ రీజనల్ జాయింట్ డైరక్టర్ ఉత్తర్వులు జరీ చేసినట్లు వెల్లడించారు. బనగానపల్లె పట్టణంలోని ఎస్సీ బాలుర హాస్టల్ విద్యార్థులతో హెచ్‌ఎం జానకి తన ఇంటిలో పనిచేయించు కుంటున్నట్లు ఆరోపణలు రావడంతో సస్పెన్షన్ వేటు వేసినట్లు తెలిపారు. అలాగే స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న డి.నాగరాజును హెచ్‌ఎంగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు

ఆటోను ఢీకొన్న కారు..

ఇద్దరు వృద్ధులకు తీవ్ర గాయాలు

ఆదోని రూరల్, మార్చి 1 : ఆదోని మండలం పెద్దతుంబళం శివారులోని జైన్ దేవాలయం వద్ద ప్రయాణికులతో వెళ్తున్న ఆటోను కారు ఢీకొంది. దీంతో ఇద్దరు వృద్ధులకు తీవ్ర గాయాలయ్యాయి. పెద్దతుంబళం నుంచి ఆటోలో శాంతమ్మ, బల్లేకల్లుకు చెందిన రామయ్యతోపాటు పలువురు ఆదోనికి బయల్దేరారు. గ్రామ శివార్లలోకి చేరుకోగానే ఆదోని నుంచి మాధవరం వెళ్తున్న కారు టైరు పంక్చర్ అయి ఆటోను ఢీకొట్టింది. దీంతో శాంతమ్మ, రామయ్యలకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని స్థానికులు ఆదోని ఆసుపత్రికి తరలించారు. రామయ్య పరిస్థితి విషమంగా ఉండడంతో కర్నూలుకు తీసుకెళ్లారు. కారు డ్రైవర్ పాండును అదుపులో తీసుకున్నామని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పీరయ్య తెలిపారు.

భారీగా కర్ణాటక మద్యం స్వాధీనం

వ్యక్తి అరెస్టు.. వాహనం సీజ్, ఒకరు పరార్

మంత్రాలయం, మార్చి 1: మండలంలోని మాధవరం సమీపంలో తుంగభద్ర నది ఒడ్డున పరమాన్‌దొడ్డి తండాకు చెందిన సుగాలి రమేష్ నాయక్ అనే వ్యక్తి కర్ణాటక మద్యం తరలిస్తుండగా మాధవరం ఎస్ఐ క్రిష్ణమూర్తి పట్టుకున్నారు. శుక్రవారం తుంగభద్ర నది నుంచి తరలిస్తున్న 15 బాక్సుల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కర్ణాటక నది ఒడ్డు నుంచి పాత టాటా ఏసీ ట్రాలీ వాహనంలో కర్ణాటక మద్యం తరలిస్తుండగా.. దాడులు చేసి పట్టుకున్నారు. ఇందులో డ్రైవర్ బోయ లేపాక్షిని అరెస్టు చేసి ఎమ్మిగనూరు కోర్టుకు తరలించగా.. మద్యం ఉన్న సుగాలి రమేష్ నాయక్ పరారిలో ఉన్నాడు. ఈ దాడుల్లో ఏఎస్ఐ బందెనవాజ్, హెడ్ కానిస్టేబుల్ వీరేష్, వీరాంజనేయులు, సోమశేఖర్ పాల్గొన్నారు.

4న సీఎం సార్ వస్తున్నారు...

ఆదివారం బడి పెట్టుకోండి

- సోమవారం సెలవు తీసుకోండి
- ప్రైవేటు యాజమాన్యానికి డీఈవో సందేశం

నంద్యాల (నూనెపల్లె), మార్చి 1 : నంద్యాల జిల్లా బనగానపల్లెకు ఈనెల 4వ తేదీన సీఎం వస్తున్నారు. అన్ని ప్రైవేటు యాజమాన్య పాఠశాలలు 3వ తేదీన ఆదివారం పాఠశాలలు నడపాలని, 4వ తేదీ సోమవారం సెలవు తీసుకోవాలని, ఆదివారం సాయంత్రం 5 గంటలలోపు పాఠశాలల వాహనాలను తమకు హ్యాండోవర్ చేయాలని నంద్యాల డీఈవో సందేశం పంపారు. డీఈవో సందేశంపై ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం తలలు పట్టుకుంటున్నారు. ఇటీవలే అనంపురం జిల్లా రాప్తాడు సిద్ధం సభకు వందల సంఖ్యలో ప్రైవేటు పాఠశాలల వాహనాలను సభకు పంపించామని, మళ్లీ ఇప్పుడు ఇదేం తతంగమంటూ పెదవి విరుస్తున్నారు. దీనిపై విద్యార్థి, వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు మండిపడుతున్నారు. విద్యాశాఖాధికారై ఉండి ఇలా వ్యవహరించడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

6వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 1: జిల్లాలోని ఆదర్శ పాఠశాలలో 6వ తరగతిలో ప్రవేశాల కోసం దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి సామ్యూల్ శుక్రవారం తెలిపారు. ఈ నెల 3 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఏప్రిల్ 21వ తేదీన ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు ఆయా ఆదర్శ పాఠశాలలో 5వ తరగతి సిలబస్‌తో తెలుగు, ఇంగ్లీషు మీడియాలలో ప్రవేశ పరీక్ష జరుగుతుందన్నారు. ప్రవేశ పరీక్ష కోసం ఓసీ, బీసీ విద్యార్థులు రూ.150లు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.75లు మార్చి 2 నుంచి 31వ తేదీ వరకు నెట్ బ్యాంకింగ్, క్రెడిట్, డెబిట్ కార్డులను ఉపయోగించి రుసుము చెల్లించాలన్నారు.

టీడీపీ గెలుపునకు కృషి చేయాలి: బీసీ



శంఖారావం కిట్లను పంపిణీ చేస్తున్న బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, మార్చి 1: తెలుగుదేశం పార్టీ గెలుపునకు కార్యకర్తలు కృషి చేయలని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ఉదయం బనగానపల్లె టీడీపీ కార్యాలయంలో శంఖారావం శిక్షణా తరగతులు నిర్వహించి టీడీపీ విస్తృత సమావేశం నిర్వహించారు. బనగానపల్లె నియోజకవర్గంలోని బనగానపల్లె, అవుకు, కొలిమిగుండ్ల, సంజామల, కోవెలకుంట్ల మండలాలకు చెందిన చెందిన క్లస్టర్ ఇంచార్జిలు, యూనిట్ ఇంచార్జిలు, బూత్ ఇంచార్జిలకు శంఖారావం కిట్లును బీసీ పంపిణీ చేశారు. వారిని ఉద్దేశించి బీసీ మాట్లాడుతూ టీడీపీ సూపర్ సిక్స్ పథకాలు ఇంటింటికీ ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. యువతకు 20 లక్షలు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. తొలిసారి ఓటరుగా నమోదు చేయించుకున్న వారికి ఈనెల 3వతేదీ ఆదివారం 9 గంటలకు బనగానపల్లె పట్టణంలోని ఆర్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ బనగానపల్లె మండల అధ్యక్షుడు పీవీ కుమార్‌రెడ్డి, రాష్ట్ర టీడీపీ ప్రధాన కార్యదర్శి నంద్యాల రామేశ్వరరెడ్డి, బురానుద్దీన్, కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి, బొబ్బల గోపాల్‌రెడ్డి, కాశీంబాబు, సలాం, వెంకటరమణనాయక్, గడ్డం అమర్‌నాథ్ రెడ్డి, లింగాలనాయుడు, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓట్లు అడిగే అర్హత వైసీపీకి లేదు

మాజీ మంత్రి భూమా అఖిలప్రియ



శిరివెళ్లలో పర్యటిస్తున్న మాజీ మంత్రి భూమా అఖిలప్రియ

శిరివెళ్ల, మార్చి 1: ప్రజలను ఓట్లు అడిగే అర్హత వైసీపీ నాయకులకు ఏ మాత్రం లేదని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ అన్నారు. శిరివెళ్ల గ్రామానికి చెందిన ముల్లా హబీబ్ బాషా, ముల్లా అబ్దుల్ రెహమాన్, ముల్లా అన్సర్ బాషా, షఫి, ముల్లా అక్తర్, ముల్లా మహమ్మద్ గౌస్, షేక్ అబ్దుల్లా, షేక్ కరీం బాషా తదితరులు 50 కుటుంబాలతో అఖిలప్రియ, ఆమె భర్త భార్గవ్‌రామ్ నాయుడు సమక్షంలో శుక్రవారం టీడీపీలో చేరారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వైసీపీ రాక్షస పాలనతో విసిగిపోయిన ప్రజలు స్వచ్ఛందంగా టీడీపీలోకి వస్తుంటే వారిని భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. ఓడిపోతామన్న భయంతోనే వైసీపీ నాయకులు ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక నియోజకవర్గంలోని కార్మికుల సంక్షేమం కోసం ఆళ్లగడ్డ, శిరివెళ్లలో ఆటో నగర్‌లను ఏర్పాటు చేస్తామన్నారు. వైసీపీ ఎమ్మెల్యేలకు దోచుకోవడం.. దాచుకోవడమే తెలుసు తప్ప ప్రజా సంక్షేమం పట్టదన్నారు. బీసీ ఖాజా హుసేన్, బీసీ ఫిదా హుసేన్, యామా గుర్రప్ప, సూరా రామ, బీఎండీ రఫీ, అబూబకర్ సిద్ధిఖ్, పీఎండీ ఉస్మాన్, అబ్దుల్ అజీస్, షఫీవుల్లా, పీపీ లింగమయ్య పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తులు

బనగానపల్లె, మార్చి 1: ఏపీ మోడల్ స్కూల్‌లో 2024-25 విద్యాసంవత్సరానికి బనగానపల్లె ఏపీ మోడల్‌స్కూల్ ఆరో తరగతి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రామలక్ష్మి శుక్రవారం కోరారు. 6వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకునేవారు. గుర్తింపు పొందిన పాఠశాల నుంచి 5వ తరగతి తెలుగు, ఇంగ్లీషు మీడియంలో చదువుతూ ఉన్నవారు అర్హులన్నారు. బీసీ, ఓసి విద్యార్థులు 01-.09.-2012 నుంచి 31-.08-.2014 సంవత్సరాల మధ్య, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 01-.09-.2010 సంవత్సరాల నుంచి 31-.08-.2014 సంవత్సరాల మధ్య జన్మించిన వారై ఉండాలన్నారు. ఈనెల 3 వతేదీనుంచి 31 వతేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.150, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.75 చెల్లించి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 21న అన్ని మోడల్ పాఠశాలల్లో 6వతరగతిలో ప్రవేశ పరీక్షలు ఉదయం 10 గంటలనుంచి 12 గంటల వరకు తెలుగు, ఇంగ్లీషు మీడియంలో ఉంటాయన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులకు 35 మార్కులు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 30 మార్కులు కనీస అర్హత మార్కులన్నారు. రిజర్వేషన్‌ల ప్రకారం సీట్లు కేటాయింపు ఉంటుందన్నారు.

డోన్(రూరల్): డోన్ పట్టణ సమీపంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో 6వ తరగతి ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ జాస్మిన్ కోరారు. శుక్రవారం ఆమె కార్యాలయంలో మాట్లాడుతూ ఈనెల 3 నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

నంద్యాల, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. ఆళ్లగడ్డ పట్టణంలోని కేవీ సుబ్బారెడ్డి, ప్రజ్ఞ, ప్రభుత్వ వైపీపీఎం కళాశాలల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు.

బనగానపల్లె: బనగానపల్లె పట్టణంలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పబ్లిక్ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఎస్వీ జూనియర్ కళాశాల, కంకరగురెడ్డి కళాశాల కేంద్రాలలో పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 277 మంది, ఎస్వీ జూనియర్ కళాశాలలో 220 మంది, కెజీఆర్ జూనియర్ కళాశాలలో 256 మంది పరీక్షలు రాశారు. ఫ్లైయింగ్ స్క్వాడ్ పరీక్షా కేంద్రాలను పరిశీలించారు.

చాగలమర్రి: చాగలమర్రి వాసవీ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మొదటి సంవత్సరం 280 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 269 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు సీఎస్ చిన్న పీరయ్య, డీవో అనితకుమారి తెలిపారు. 11 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరయ్యారని చెప్పారు.

రాష్ట్రంలో రాక్షస పాలన: జనసేన

డోన్(రూరల్), మార్చి 1: రాష్ట్రంలో రాక్షస పాలన నడుస్తున్నదని జనసేన నియోజకవర్గ నాయకుడు ఆలా మోహన్ రెడ్డి అన్నారు. శుక్రవారం మధ్యాహ్నం జనసేన పార్టీ కార్యాలయాన్ని డోన్ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అధికారికంగా ప్రారంభించారు. అనంతరం జనసేన పార్టీ కార్యాలయంలో జనసేన నాయకులు ఆలా మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో కోట్లను సత్కరించారు. జనసేన నాయకులు పరదేశి మహేష్, గణేష్, కునిశెట్టి రాయల్ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చౌడేశ్వరీమాత పల్లకి సేవ

బనగానపల్లె, మార్చి 1: మండలంలోని నందవరం చౌడేశ్వరీమాత ఆలయంలో శుక్రవారం పల్లకి సేవ ఘనంగా నిర్వహించారు. ఆలయంలో భక్తులు, పూజారుల ఆధ్వర్యంలో అమ్మవారిని పల్లకిలో ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని మొక్కులు తీర్చుకున్నారు.

కన్యకాపరమేశ్వరికి ప్రత్యేక పూజలు

రుద్రవరం, మార్చి 1: రుద్రవరంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు అమ్మవారికి అభిషేకం చేసి నూతన చీరతో అలంకరించారు. అనంతరం ఆర్యవైశ్యులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

ఘనంగా ఉరుసు

అవుకు, మార్చి 1: మండలంలోని కునికుంట్ల గ్రామ సమీపంలో ఉన్న టెక్కే స్వామి దర్గాలో ఉరుసు వేడుకలు ఘనంగా శుక్రవారం జరుపుకున్నారు. గ్రామ టీడీపీ నాయకులు గూడాల శివరాం రెడ్డి, ప్రతాప్ రెడ్డి, మురళీధర్ రెడ్డి ఆధ్వర్యంలో ఉరుసు వేడుకలు నిర్వహించారు. శనివారం జియాత్‌తో వేడుకలు ముగియనున్నాయి.

బుగ్గన అరాచకాలను అడ్డుకుంటాం..



వేదికపై మాజీ మంత్రులు కేఈ ప్రభాకర్, కేఈ కృష్ణమూర్తి, డోన్ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి

- మైనింగ్ వ్యాపారులను ఆయన బెదిరిస్తున్నారు
- అభివృద్ధి అంతా కాంట్రాక్టర్లకే
- అర్ధరాత్రి తలుపు తట్టినా పలుకుతా
- మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ





డోన్, మార్చి 1: అధికార బలంతో డోన్ నియోజకవర్గంలో మంత్రి బుగ్గన చేస్తున్న అరాచకాలను అడ్డుకుంటామని మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని మధు ఫంక్షన్ హాలులో డోన్ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి ఆత్మీయ సభలో కోట్ల సుజాతమ్మ మాట్లాడుతూ డోన్ నియోజకవర్గంలో మైనింగ్ వ్యాపారులను మంత్రి బుగ్గన టార్గెట్ చేసి బెదిరిస్తున్నారని ధ్వజమెత్తారు. ఆయన అభివృద్ధి అంతా కాంట్రాక్టర్లకు పనులు ఇచ్చుకోవడమే అని విమర్శించారు. బుగ్గన చేసిన ప్రతి పనికి తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందన్నారు. డోన్ నియోజకవర్గంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశానన్నారు. డోన్ ఎప్పటికీ కేఈ, కోట్ల కుటుంబాల అడ్డా అని ఉద్ఘాటించారు. ఇక మా అడ్డాలో మీ అరాచకాలను సాగనివ్వమన్నారు. ఎవరూ అధైర్య పడాల్సిన అవసరం లేదని, అర్ధరాత్రి తలుపు తట్టినా తాము పలుకుతామని అన్నారు. బేతంచెర్ల మండలంలో మైనింగ్ వ్యాపారులను మంత్రి బుగ్గన ఎన్నో ఇబ్బందులకు గురి చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బుగ్గన పాలనపై ప్రజలు విసిగిపోయారన్నారు. టీడీపీలో చేరాలని సింగిల్ విండో మాజీ ఛైర్మన్ వెంకటరెడ్డి వస్తోంటే.. వైసీపీ నాయకులు ఐదు వాహనాలతో అడ్డగించినా భయపడలేదన్నారు. పార్టీ కార్యకర్తలను కాపాడుకునేందుకు తాను అన్ని రకాలుగా అండగా ఉంటానన్నారు.

మంచి నాయకుడిని గెలిపించుకుందాం : టీఈ కేశన్నగౌడు



డోన్ నియోజకవర్గ ప్రజలకు సేవ చేసేందుకు ఒక మంచి నాయకుడు వచ్చాడని, కోట్ల సూర్యప్రకాష్ రెడ్డిని గెలిపించుకుని చంద్రబాబుకు కానుకగా ఇద్దామని డోన్ మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ కేశన్నగౌడు అన్నారు. శుక్రవారం డోన్ సభలో కేశన్నగౌడు మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు డోన్ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థిగా కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి పేరును ప్రకటించడం అంటే 50 శాతం విజయం సాధించినట్లే అన్నారు. అందరం ఎన్నికల్లో కష్టపడి పని చేసి వంద శాతం విజయం సాధిద్దామన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను కేఈ కుటుంబాన్ని ఆదరించినట్లుగానే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డికి కూడా అండగా ఉండి ఆదరించాలన్నారు.

డోన్‌లో టీడీపీ జెండాను ఎగురవేసి చంద్రబాబుకు కానుకగా ఇద్దామన్నారు. ఈ కార్యక్రమంలో డోన్ నియోజకవర్గ టీడీపీ యువ నాయకులు కోట్ల రాఘవేంద్రరెడ్డి, కోట్ల నివేదిత మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ టీఈ కేశన్నగౌడు, ఓబులాపురం శేషిరెడ్డి, మర్రి రమణ, దేవరబండ వెంకటనారాయణ, భాస్కర్ నాయుడు, ఎస్ఎండీ రఫి, కేఈ శ్యాం, రంజిత్ కిరణ్, దిలీప్ రెడ్డి, భూమా నాగన్న, బాష్యం శ్రీను, వలసల బాలుడు, హరిశంకర్ గౌడు తదితరులు పాల్గొన్నారు.

బుగ్గన అభివృద్ధి పోస్టర్లకే పరిమితం : కేఈ శ్యాంబాబు



డోన్ నియోజకవర్గంలో మంత్రి బుగ్గన అభివృద్ధి పోస్టర్ల మీదికే పరిమితం అయిందని పత్తికొండ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కేఈ శ్యాంబాబు అన్నారు. శుక్రవారం పట్టణంలోని మధు ఫంక్షన్ హాలులో డోన్ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి ఆత్మీయ సభలో కేఈ శ్యాంబాబు మాట్లాడుతూ.. మన డోన్.. మన అభివృద్ధి అని మంత్రి బుగ్గన ఎక్కడ చూసినా పోస్టర్లు వేయించడం విడ్డూరంగా ఉందన్నారు. అంతక ముందు డోన్ నియోజకవర్గ ప్రజలకు తిరగడానికి రోడ్లు లేవా? తాగడానికి మంచినీళ్ల లేవా? తానే అభివృద్ధి చేసినట్లు ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. కోట్ల, కేఈ కుటుంబాలు దశాబ్దాలుగా నియోజకవర్గ ప్రజలకు ఎంతో అభివృద్ధిని అందించారని అన్నారు. మంత్రి బుగ్గన ఉత్తుత్తి పోస్టర్లు వేసుకుని దొంగ ప్రచారాలు చేసుకుంటున్నారని ఆయన మండిపడ్డారు. డోన్‌లో టీడీపీ జెండాను అందరం కలిసికట్టుగా పని చేసి ఎగురవేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ ఛైర్మన్ బత్తిన వెంకట్రాముడు, శాలివాహన ఫెడరేషన్ మాజీ ఛైర్మన్ తుగ్గలి నాగేంద్ర, ఆలంకొండ నబీసాహెబ్, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి విజయభట్టు, ఆర్ఈ నాగరాజు, ఆలేబాదు పరమేష్, ఎల్లయ్యగౌడు, జనసేన నాయకులు ఆలా మోహన్ రెడ్డి, పరదేశీ మహేష్, బ్రహ్మం పాల్గొన్నారు.



వేదికపై టీఈ కేశన్న గౌడ్, నాగేశ్వర్ యాదవ్

టీడీపీలో చేరిక



డోన్: పట్టణంలోని మధు ఫంక్షన్ హాలులో టీడీపీ ఆధ్వర్యంలో జరిగిన ఆత్మీయ సభలో డోన్ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి సమక్షంలో ప్యాపిలి సింగిల్ విండో మాజీ ఛైర్మన్ గుడిపాడు వెంకటరెడ్డి టీడీపీలో చేరారు. టీడీపీలో చేరకుండా వెంకటరెడ్డిని అడ్డుకునేందుకు వైసీపీ నాయకులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. అదేవిధంగా వెంకటనా యునిపల్లె సర్పంచ్ సీలం చంద్రశేఖర్ నాయుడు కోట్ల సమక్షంలో టీడీపీలో చేరారు.



ఆత్మీయ సమావేశానికి హాజరైన జనసేన, టీడీపీ నాయకులు, కార్యకర్తలు

విజయం మనదే



రానున్న 45 రోజుల ఎన్నికల యుద్ధంలో టీడీపీ విజయం సాధిస్తుంది. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి టీడీపీ నాయకులను, కార్యకర్తలను ఎన్నో ఇబ్బందులకు గురి చేశారు. వాటన్నింటిని లెక్క చేయకుండా పార్టీ కార్యకర్తలు టీడీపీ జెండానే మోస్తూ వచ్చారు. డోన్‌లో కోట్ల సూర్యప్రకాష్ రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలి.

- మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత

జనాన్ని చూస్తుంటే గెలిచినట్లనిపిస్తోంది



డోన్‌లో టీడీపీ ర్యాలీకి వచ్చిన జనాన్ని చూస్తుంటే.. ఎమ్మెల్యేగా కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి గెలిచినట్లే అనిపిస్తున్నది. కోట్ల కుటుంబానికి పదవులు కొత్తేమీ కాదు. ప్రజల కోసం సూర్య ప్రకాష్‌రెడ్డి ప్రయత్నిస్తారు.

- మంత్రాలయం ఇన్‌చార్జి పాలకుర్తి తిక్కారెడ్డి

డోన్‌లో నివాసం ఉంటా



ఎన్నికలప్పుడు మాత్రమే వస్తారని, ఆ తర్వాత వెళ్లిపోతారని కొందరు విమర్శలు చేస్తున్నారు. దీనికి సమాధానంగా డోన్‌లోనే నేను నివాసముంటాను. టీడీపీ అధినేత చంద్రబాబు ఎంతో నమ్మకంతో డోన్ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థిగా నా తండ్రిని పోటీల్లో నిలిపారు. నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండేందుకు ఇక నుంచి నేను డోన్‌లోనే నివాసం ఏర్పాటు చేసుకుంటాను.

- కోట్ల రాఘవేంద్రరెడ్డి

టీడీపీ గెలుపునకు కృషి -కేవీ సుబ్బారెడ్డి

తెలుగుదేశం పార్టీ గెలుపునకు కృషి చేస్తానని కేవీ సుబ్బారెడ్డి విద్యాసంస్థల అధినేత, టీడీపీ నాయకుడు కేవీ సుబ్బారెడ్డి అన్నారు. శుక్రవారం డోన్‌లో నిర్వహించిన కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి ఆత్మీయ సభలో ఆయన మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు సమక్షంలో టీడీపీ సీనియర్ నాయకులు గౌరు వెంకటరెడ్డి సహకారంతో టీడీపీలో చేరానన్నారు.



వేదికపై అభివాదం చేస్తున్న కేఈ కృష్ణమూర్తి, కోట్ల జయసూర్యప్రకాష్ రెడ్డి

వైభవంగా స్వాతి వేడుకలు



సుదర్శన హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

నంద్యాల, మార్చి 1(ఆంధ్రజ్యోతి): అహోబిలం లక్ష్మీనరసింహ స్వామి జన్మనక్షత్రమైన స్వాతి వేడుకలు శుక్రవారం వేద పండితులు ఘనంగా నిర్వహించారు. దిగువ అహోబిలంలోని ఉత్సవమూర్తులైన ప్రహ్లాద వరదస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవారకు పూజలు చేశారు. అనంతరం 108 కలశాలతో సుదర్శన హోమాన్ని వేదమంత్రోచ్ఛరణల మధ్య నిర్వహించారు. భక్తులకు వేదపండితులు తీర్థప్రసాదాలు అందించారు.

'రాష్ట్ర పండుగగా పార్వేట ఉత్సవం'

అహోబిలం లక్ష్మీనరసింహస్వామి పార్వేట ఉత్సవ పల్లకి పర్యటనను రాష్ట్ర పండుగగా రాష్ట్ర ప్రభుత్వం గుర్తించిందని అహోబిలం సమాచార ప్రతినిధి ప్రహ్లాద వరదన్ శుక్రవారం చెప్పారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్వర్వులు జారీ చేసిందని చెప్పారు. పార్వేట ఉత్సవ పల్లకి పర్యటన గత శతాబ్ద కాలంగా ప్రతి ఏడాది జనవరి 16న ప్రారంభం అవుతుందని, ఉత్సవ పల్లకి గ్రామాల్లో విధిగా ఏర్పాటు చేసిన తెలుపుల వద్ద విడిది చేసినపుడు కులమతాలకు అతీతంగా భక్తులతో పూజలందుకుంటున్నారన్నారు. లక్ష్మీనరసింహస్వామి భక్తుల వద్దకు వెళ్లి పూజలందుకోవడం అనేది రెండు తెలుగు రాష్ట్రాలలో ఎక్కడా లేని విధంగా జరుగుతోందన్నారు. పర్యటన ముగించుకొని ఉత్సవ పల్లకి తిరిగి అహోబిలం చేరుకున్న అనంతరం బ్రహ్మోత్సవాలు నిర్వహించడం, ఈ ఉత్సవాలలో శ్రీలక్ష్మీనరసింహస్వామి, చెంచులక్ష్మీ అమ్మవార్ల కల్యాణం కమనీయంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు.

సుబ్బారెడ్డి ఆత్మీయ సభకు తరలిరండి

బేతంచెర్ల, మార్చి 1: డోన్‌లో ధర్మవరం సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో శనివారం జరిగే ఆత్మీయ సభకు బేతంచెర్ల నుంచి సుమారు వంద వాహనాల్లో తెలుగు తమ్ముళ్లు తరలి రావాలని టీడీపీ మండల సమన్వయ ఛైర్మన్ మాజీ ఎంపీటీసీ సభ్యుడు చంద్రశేఖర్ కార్యకర్తలకు, నాయకులకు పిలుపునిచ్చారు. శుక్రవారం సాయంత్రం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో పట్టణ టీడీపీ ప్రధాన కార్యదర్శి షేక్షావలి చౌదరి అధ్యక్షతన టీడీపీ ముఖ్య నాయకుల, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలకు డోన్‌లో జరిగే సభకు అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు రామగోపాల్, రామ్మూర్తి, నంద్యాల మధు, రమేష్, లోకేశ్‌గౌడు, జీవన్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా జీవించండి: సీఐ

బేతంచెర్ల, మార్చి 1: గ్రామాల్లో ప్రజలు శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా జీవించాలని సీఐ ప్రియతమ్ రెడ్డి సూచించారు. శుక్రవారం రాత్రి వచ్చే సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు బేతంచెర్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో గల సమస్యాత్మక గ్రామం కొలుములపల్లెలో సీఐ ప్రియతమ్ రెడ్డి, ఎస్ఐ శివశంకర్ నాయక్ సిబ్బందితో కలిసి రాత్రి బస కార్యక్రమంలో భాగంగా సచివాలయానికి దగ్గర వివిధ పార్టీల నాయకులు, గ్రామప్రజలతో సమావేశం ఏర్పాటు చేశారు. సీఐ మాట్లాడుతూ గ్రామాల్లో ఎటు వంటి గొడవలకు, అల్లర్లకు పాల్పడినా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుళ్లు తిరుపాల్ నాయక్, చంద్రశేఖరప్ప, పీసీ తిరుమలయ్య, మధు మహేష్, గురుబాబు పాల్గొన్నారు.

మొక్కలు దగ్ధం

రుద్రవరం, మార్చి 1: మండలంలోని యల్లావత్తుల సమీపంలో రహదారి వెంట ఇరువైపులా శుక్రవారం మొక్కలు కాలిపోయాయి. ఈ రహదారి వెంట అవెన్యూ ప్లాంటు కింద ఉపాధి హామీ పథకం అధికారులు మొక్కలు నాటారు. నాటిన మొక్కలు మంటల్లో కాలిపోయాయి. మొక్క దశలోనే నిప్పులకు బలవుతున్నాయి. అధికారులు మాత్రం గ్రామాల్లో అవగాహన కల్పించి మొక్కలు కాలిపోకుండా చూడాల్సిన బాధ్యత ఉంది.

'బాలికా విద్యను ప్రోత్సహించాలి'

రుద్రవరం, మార్చి 1: బాలిక చదువు దేశానికి వెలుగు అని, ప్రతి ఒక్కరూ బాలికా విద్యను ప్రోత్సహించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవి సూచించారు. శుక్రవారం రుద్రవరం కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయలో శుక్రవారం బేటి బచావో బేటి పడావో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు అవగాహన కల్పించారు. మహిళా పోలీసులు గుడ్, బ్యాడ్ టచ్‌ల గురించి వివరించారు.

బనగానపల్లె: బనగానపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సి పాల్ స్వర్ణలతాదేవి అధ్యక్షతన బేటీ బచావో బేటీ పడావో అవగాహన సదస్సు బనగానపల్లె ఐసీడీఎస్ సీడీపీవో ఉమామహేశ్వరమ్మ, సూపరవైజర్ల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ కౌసల్యాదేవి మాట్లాడారు.

ఓపీఎస్‌ను అమలు చేయాలి

ప్యాపిలి, మార్చి 1: ఓపీఎస్‌ను అమలు చేయాలని యూటీఎఫ్ మండల అధ్యక్షుడు క్రిష్ణానాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని ఏనుగమర్రి ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు ఓటు ఫర్ ఓపీఎస్ బుక్ లెట్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా క్రిష్ణానాయక్ మాట్లాడుతూ ఓపీఎస్‌ను రద్దు చేయకపోతే దశల వారీగా ఆందోళనలు చేస్తామని హెచ్చరిం చారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'ప్రభుత్వ వైద్యశాలలో ప్రసవాలు సురక్షితం'

దొర్నిపాడు, మార్చి 1: ప్రభుత్వ వైద్యశాలలో ప్రసవసాలు సురక్షితంగా జరుగుతాయని వైద్యాధికారి నాగేంద్ర అన్నారు. గర్భిణులు ప్రతి నెల ప్రభుత్వ వైద్యశాలలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. స్టాఫ్ నర్స్ సాయికృప, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో పూర్ణాహుతి

చాగలమర్రి, మార్చి 1: చాగలమర్రి గ్రామంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో మాఘమాసం సందర్భంగా శుక్రవారం వేద పండితుడు పెద్దశాస్త్రి ఆధ్వర్యంలో పూర్ణాహుతి, గణపతి, రుద్రహోమాలు నిర్వహించారు. దంపతులతో కలశ స్థాపన, మహన్యాస రుద్రాభిషేకం చేశారు. మహిళలు సామూహికంగా ఒడిబియ్యం కార్యక్రమాన్ని నిర్వహించారు. వెండి రథంలో అమ్మవారిని కొలువుదీర్చి ఊరేగింపు చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు లక్ష్మణబాబు, కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

కౌలపల్లిలో రామాలయం

ఫలించిన దశాబ్దాల కల

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



కౌలపల్లిలో కొత్తగా నిర్మించిన రామాలయం

ప్యాపిలి, మార్చి 1: మండలంలోని కౌలపల్లి గ్రామంలో శుక్రవారం రామాలయాన్ని గ్రామస్తులు ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గతంలో ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనాన్ని గ్రామస్తులు గుర్తుకు తెచ్చుకున్నారు. ప్యాపిలి మండలంలోని మారుమూల కౌలపల్లి గ్రామంలో దాదాపు 120 కుటుంబాలు ఉన్నాయి. ఈ ఊళ్లో ఏ ఒక్క దేవాలయం లేదు. గత 30 ఏళ్ల నుంచి రామాలయాన్ని నిర్మిం చాలని గ్రామస్థులు అనుకున్నా, రాజకీయ కారణాలతో నిర్మించుకోలేక పోతు న్నారు. అలాగే ఆ గ్రామంలో బడి కూడ మూతపడింది. దీంతో గుడి, బడి లేని ఆ గ్రామం పరిస్థితిపై 2021 ఆగస్టు 8వ తేదిన ఆంధ్రజ్యోతి దినపత్రిక ఒక కథనం ప్రచురించింది. దీంతో వివిధ ప్రాంతాల్లో ఉద్యోగాలు చేస్తున్న ఆ ఊరి యువకులు, రాజకీయ నాయకులు, గ్రామ పెద్దలు కలసికట్టుగా ఆలయ నిర్మాణానికి పూనుకున్నారు.

డోన్‌కు తరలిన తెలుగు తమ్ముళ్లు



డోన్‌కు తరలివెళ్తున్న టీడీపీ నాయకులు

బేతంచెర్ల, మార్చి 1: డోన్‌లో టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి నిర్వహించిన బహిరంగ సభకు బేతంచెర్ల నుంచి దాదాపు వంద వాహనాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. మండల టీడీపీ కన్వీనర్ ఎల్ల నాగయ్య, సీనియర్ టీడీపీ నాయకురాలు బుగ్గన ప్రసన్నలక్ష్మి, జిల్లా ఉపాధ్యక్షుడు పోలూరు వెంకటేశ్వరరెడ్డి, పోలూరు రాఘవరెడ్డి ఆధ్వర్యంలో వాహనాల్లో బేతంచెర్ల మండలం నుంచి తెలుగు తమ్ముళ్లు భారీగా తరలివెళ్లారు.

ప్యాపిలి: డోన్‌లో టీడీపీ సభకు మండలం నుంచి శుక్రవారం ఆ పార్టీ శ్రేణులు భారీగా తరలి వెళ్లారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వై నాగేశ్వరరా వుయాదవ్, మాజీ ఎంపీపీ టి శ్రీనివాసులు, ఆలేబాదు పరమేష్ ఆధ్వర్యంలో దాదాపు 100 వాహనాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు.

'శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు'

చాగలమర్రి, మార్చి 1: గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని ఆళ్లగడ్డ రూరల్ సీఐ హనుమంతనాయక్ హెచ్చరించారు. శుక్రవారం రాత్రి చాగలమర్రి గ్రామంలోని పెద్దమకానం సెంటర్‌లో ప్రజలతో మాట్లాడుతూ ఎన్నికల్లో ఎలాంటి గొడవలు, అల్లర్లు సృష్టించరాదని అన్నారు.